

మరో ఐదు రోజులు..

- ఈనెల 15 వరకు కాటన్ బ్యారేజ్‌పై
- రాకపోకలు నిలిపివేత
- కలెక్టర్ మాధవీలత వెల్లడి

- 5లో

త్వరలో పవన్ రాక

- జనసేనాని ఉభయ గోదావరి జిల్లాల పర్యటన ఖరారు
- ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు పర్యటన
- టీడీపీ నేతలతోనూ సమావేశమయ్యే అవకాశం
- కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంలలో మూడు రోజులపాటు ఉండేలా ప్రణాళిక

- 5లో

ఉభయగోదావరి జిల్లాల్లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు పర్యటిస్తారు. ఇందులో తొలిరోజు భీమవరంలో పర్యటన ఉంటుంది. 15, 16 అమలాపురం, కాకినాడలో, 17న రాజమహేంద్రవరంలో పవన్ సమావేశాలు ఉండ వచ్చని సమాచారం. జనసేన నియోజకవర్గాల వారీ సమీక్షలు, టీడీపీ నాయకులతో భేటీలు ఉంటాయి.





నేడు రాజమహేంద్రవరంలో దళిత సింహగర్జన సభ

- భారీగా ఏర్పాట్లు.. 30 వేల మందికి కూర్చునేలా సౌకర్యాలు
- దళితులకు జరిగిన అన్యాయాన్ని ప్రపంచానికి చాటేందుకే సభ
- 27 పథకాలు రద్దు చేసిన జగన్‌పై యుద్ధం
- ఏర్పాట్ల పరిశీలనలో మాజీ ఎంపీ హర్షకుమార్

- 5లో



కొవ్వూరు గోదావరి గట్టు కాటన్ విగ్రహం నుంచి రైల్వే స్టేషన్ వరకు పట్టాల చెంతనే వేసిన చెత్త నుంచి పొగలు





రైల్వేస్టేషన్ రోడ్డులో చెత్తకు నిప్పు పెట్టడంతో వస్తున్న పొగ.. (పక్కన) కాటన్ విగ్రహం వద్ద పోలీస్‌స్టేషన్‌కు ఇచ్చిన స్థలంలో నిల్వ ఉన్న వర్షపు నీరు

ఈ దహనకాండ ఆరేదెన్నడు..

- కొవ్వూరులో అడుగడుగునా రోడ్ల పక్కనే చెత్త డంపింగ్
- పట్టణంలో ప్రతి చోటా మండుతున్న చెత్త కుప్పలే దర్శనం
- ప్రస్తుతం రైలు పట్టాల చెంతనే చెత్త డంపింగ్ చేసి దహనం
- తగలబెట్టడంతో వ్యాపిస్తున్న పొగతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- దశాబ్దాలకాలంగా పట్టణంలో తీరని డంపింగ్ యార్డు సమస్య
- మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వనిత హయాంలో పూర్తి నిర్లక్ష్యం

కొవ్వూరు, ఫిబ్రవరి 10 : కొవ్వూరు మున్సిపాల్టీలో డంపింగ్ యార్డు సమస్యకు దశాబ్దాలుగా పరిష్కారం లభించడం లేదు. హోంమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం అయినా చెత్త సమస్య అలానే ఉంది. నియోజకవర్గంలో ఏ రహదారి చూసినా చెత్తపోసి తగలబెట్టిన దృశ్యాలే దర్శనమిస్తున్నాయి. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన కొవ్వూరు పట్టణంలో శాశ్వత డంపింగ్ యార్డు లేకపోవడంతో ఇంటింటా సేకరించిన చెత్తను గోదావరి గట్టుపై కాటన్ విగ్రహం నుంచి రైల్వేస్టేషన్ వరకు మినీబైపాస్‌లో రోడ్డుకు ఇరుపక్కల పోస్తున్నారు. చెత్తను రహదారి వెంబడి పారబోసి తగలబెట్టడంతో రోడ్డంతా దట్టంగా పొగ వ్యాపించి ఎదురువచ్చే వారు కొందరు కనిపించక ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. ఆ రహదారిలో ప్రయాణించాలంటే ముక్కు మూసుకోవాల్సిందేనని ప్రజలు వాపోతున్నారు. కొవ్వూరు పట్టణాన్ని ఆనుకుని లేఅవుట్‌లు వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్న అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు మున్సిపల్ డంపింగ్ యార్డుకు కనీసం 5 ఎకరాల స్థలం సేకరించలేకపోతున్నారా అంటూ ప్రజలు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. కొవ్వూరు పట్టణానికి ఆరు దశాబ్దాలుగా డంపింగ్ యార్డు సమస్యగా మారింది. 1965 ఫిబ్రవరి 1న కొవ్వూరు పురపాలక సంఘం ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటిదాకా ఇంటింటా సేకరించిన చెత్తను వేయడానికి డంపింగ్ యార్డుకు స్థలసేకరణ చేయడంలో అధికారులు, నాయకులు వైఫల్యం చెందారు. 16.23 కిలోమీటర్లు విస్తరించి ఉన్న కొవ్వూరు పట్టణంలో 23 వార్డులు సుమారు 60 వేలకు పైగా జనాభా, 13 వేల నివాస గృహాలు ఉన్నాయి. 23 వార్డుల నుంచి ప్రతిరోజు 23 టన్నులు చెత్త వచ్చి పడుతుంది. 2013-14లో నందమూరు రోడ్‌లో సుమారు 2 ఎకరాల భూసేకరణ చేసి, దానికి సంబంధించి చెల్లించవలసిన సొమ్మును మున్సిపల్ అధికారులు రెవెన్యూ శాఖకు సుమారు రూ.30 లక్షలు జమ చేశారు. అంతా సవ్యంగా జరుగుతుందన్న సమయంలో డంపింగ్ యార్డుకు సేకరిస్తున్న భూయజమాని రేటు విషయంలో కోర్టును ఆశ్రయించడంతో డంపింగ్ యార్డు సమస్య ఎక్కడికక్కడ నిలిచిపోయింది. అప్పటివరకు 1వ వార్డు రాజీవ్‌కాలనీలో నివాసాలను ఆనుకుని ఉన్న మున్సిపల్ చెరువును పూడ్చివేసి చెత్తను తాత్కాలికంగా డంపింగ్ చేసేవారు. వర్షాకాలంలో పారిశుధ్య సిబ్బంది చెత్తను రోడ్డుపై పారవేయడంతో దుర్గంధం వెదజల్లుతోందని కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొవ్వూరు మండలం ఐ.పంగిడి గ్రామంలో జిల్లా పరిషత్‌కు చెందిన 7 ఎకరాల స్థలాన్ని గుర్తించి, అప్పట్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ కొవ్వూరు పట్టణంలో సేకరించిన చెత్తను వేయడానికి డంపింగ్ యార్డుకు కేటాయించారు. మున్సిపల్ సిబ్బంది పోలీసుల సహాయంతో చెత్తను వాహనాల్లో పంగిడి తరలిస్తుండగా పంగిడి గ్రామ ప్రజలు సుమారు 11 కిలోమీటర్ల దూరం నుంచి చెత్తను తీసుకువచ్చి పంగిడి గ్రామంలో వేయడానికి వీలులేదని రోడ్డెక్కి ధర్నాలు చేపట్టడంతో చెత్త సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. దీంతో పట్టణంలోని 23 వార్డుల్లో ఇంటింటా సేకరించిన చెత్త వేయడానికి స్థలం లేకపోవడంతో పవిత్ర గోదావరి తీరం గోష్పాద క్షేత్రానికి సమీపంలోని పాతరైలు వంతెన వద్ద రైల్వే బైపాస్‌లో కాటన్ విగ్రహం వద్ద మున్సిపల్ ఖాళీస్థలంలో పారవేస్తున్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఆ స్థలాన్ని పట్టణ పోలీస్‌స్టేషన్, సబ్‌జైలు నిర్మాణానికి రెవెన్యూ అధికారులు కేటాయించారు. మున్సిపల్ స్థలాలను ఒక్కొక్కటిగా ఇతర శాఖలకు బదలాయిస్తున్నారు. మున్సిపల్ డంపింగ్ యార్డుకు పంగిడిలో సేకరించిన స్థలాన్ని స్వాధీనం చేసుకుని వినియోగంలోకి తీసుకురాలేకపోతున్నారని అధికార, ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశాల్లో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పాతరైలు వంతెన వద్ద కాటన్ విగ్రహం నుంచి రైల్వేస్టేషన్ వరకు మినీబైపాస్‌కు ఇరుపక్కలా చెత్తను పారబోసి తగలబెడుతున్నారు. ఈ నేపథ్యంలో డంపింగ్ యార్డు సమస్య పురపాలక సంఘం ఏర్పడిన నాటి నుంచి కొవ్వూరును పట్టి పీడిస్తోంది. గత ఆరు దశాబ్దాలుగా ఈ సమస్య పరిష్కారానికి ఏ ఒక్కరూ పరిష్కారం చూపకపోవడంతో సమస్య తీవ్రరూపం దాల్చింది. ఇదే నియోజకవర్గం నుంచి ఇద్దరు మంత్రులుగా కూడా పనిచేశారు. ఒకరు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖామంత్రి కేఎస్ జవహర్ హయాంలో సమస్య ఎటూ తేలలేదు. ప్రస్తుత హోంమంత్రి తానేటి వనిత హయాంలో అయినా పరిష్కారం దొరుకుతుందని ఆశించిన పట్టణవాసులకు నిరాశే ఎదురయ్యింది. దీనికి తోడు మున్సిపల్ అధికారులు పట్టణానికి కొత్త సమస్యను తెచ్చిపెడుతున్నారు. ఎక్కడో మారుమూలన వేయవలసిన చెత్తను ప్రతిరోజు లక్షలాది మంది తిరిగే రాష్ట్ర రహదారి పక్కన పారవేస్తూ నిప్పుపెడుతున్నారు. దీంతో ఆ రహదారిలో పొగ వ్యాపించి వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. కొందరు అస్వస్థతకూ గురవుతున్నారు.

ఇదేం పాలనరా బాబూ...

ఆహ్లాదకరమైన అఖండ గోదావరి సోయగాలకు నెలవుగాను, ఆధ్యాత్మిక కేంద్రంగాను ఉన్న కొవ్వూరు పట్టణం ప్రస్తుతం ఈ చెత్త సమస్యతో అధ్వానంగా మారింది. ఎక్కడా చోటులేనట్టు గోదావరి చెంతనే చెత్తను డంప్ చేస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. స్థానికంగా ఉంటున్న అధికారులెవరికీ చెత్త సమస్య పట్టడంలేదు. ప్రతిరోజు తిరిగే ప్రజలు, వాహనదారులు మాత్రం దుర్వాసన భరించలేక, ఇదేం పాలనరా బాబూ అని చూసినవారంతా ముక్కున వేలేసుకుంటున్నారు. మరోవైపు చెత్తకు నిప్పు పెట్టడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు తగలబడి పొగ రహదారి అంతటా వ్యాపిస్తోంది. రహదారి కనిపించక వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. అంతేకాకుండా ఈ పొగ నుంచి విషవాయువాలు వ్యాప్తిచెంది ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. ఎంతో విలువైన స్థలంలో గత ప్రభుత్వం సుమారు 15 ప్రభుత్వ శాఖల కార్యాలయాల సముదాయం నిర్మాణం చేపట్టడానికి ప్రతిపాదించి చర్యలు చేపట్టింది. ఇంతలో ప్రభుత్వం మారడంతో ఆ స్థలాన్ని చెత్తవేసి డంపింగ్ యార్డుగా మార్చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత కాటన్ విగ్రహం వద్ద చెత్త డంపింగ్ చేస్తున్న స్థలంలో పట్టణ పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. మున్సిపాల్టీ ఆ స్థలంలో చెత్తను తొలగించడానికి సుమారు కోటి రూపాయలు వెచ్చించి హుటాహుటీన చెత్తను మండలంలోని దేచర్ల క్వారీ గోతులు, గోష్పాదక్షేత్రం, మున్సిపల్ వాటర్‌వర్క్సు స్థలాల్లో పారబోశారు. మున్సిపల్ స్థలాలను ఇతరశాఖకు బదలాయించడంలో అధికార పార్టీ నాయకులు, అధికారులు చూపిస్తున్న శ్రద్ధ దీర్ఘకాలంగా పట్టణాన్ని వేధిస్తున్న సమస్యల పరిష్కారంలో చూపడం లేదని ప్రతిపక్ష పార్టీ నాయకులు విమర్శిస్తున్నారు. ఖాళీచేసిన స్థలంలో ఇప్పటివరకు పోలీస్‌స్టేషన్ నిర్మాణం చేపట్టలేదు. చెత్త తొలగించిన గోతుల్లో వర్షపునీరు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా డంపింగ్ సమస్యకు పరిష్కారం చూపాల్సి ఉంది.



గోదావరి బాలోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్

ఉత్సాహంగా.. గోదావరి బాలోత్సవం

- అలరించిన శాస్త్రీయ, జానపదనృత్యాలు, కోలాటం
- నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి : జేసీ తేజ్‌భరత్ పిలుపు
- తల్లిదండ్రులు భాగస్వాములు కావాలి : ఎమ్మెల్సీ ఐవీ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 10: గోదావరి బాలోత్సవం.. ఉత్సాహంగా సాగింది. రాజమహేంద్రవరం, పరిసర మండలాల పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు శాస్త్రీయ, జానపదనృత్యాలు, కోలాటం వంటి కార్యక్రమాలతో అలరించారు. శనివారం రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో గోదావరి బాలోత్సవం పేరుతో 2వ పిల్లల పండుగ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బాలోత్సవంలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు నాందిపలకాలని అన్నారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు (ఐవీ) మాట్లాడుతూ పిల్లల ఆకాంక్షలకు అంక్షలు విధిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో జరుగుతున్న గోదావరి బాలోత్సవాలు విజయవంతం కావాలని అన్నారు. ఇటువంటి పిల్లల పండుగల్లో తల్లిదండ్రులు కూడా భాగస్వాములు కావాలని ఆయన కోరారు. కొత్తగూడెం చిల్డ్రన్ క్లబ్ అధ్యక్షుడు వాసిరెడ్డి రమేష్‌బాబు, గోదావరి బాలోత్సవం అధ్యక్షుడు నున్న తిరుమలరావు, అమరావతి బాలోత్సవం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, డీసీసీబీ ఛైర్మన్ ఆకుల వీర్రాజు, సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు, రాజమహేంద్రి మహిళా విద్యాసంస్థల కరస్పాండెంట్ టీకే విశ్వేశ్వరరెడ్డి, నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ వైశ్రీనివాసరావు, దేవరపల్లి బాలోత్సవం అధ్యక్షుడు డి.సత్యనారాయణ, డాక్టర్ చైతన్యశేఖర్, అల్లు బాబి, పి.బుచ్చిరామయ్య, యూటీఎఫ్ నాయకురాలు అరుణకుమారి, గోదావరి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి పీఎస్ఎన్ రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసి, బాలోత్సవం అసోసియేట్ అధ్యక్షులు వీఎస్ఎస్ కృష్ణకుమార్ సభకు అధ్యక్షత వహించారు. రెండు రోజులపాటు గోదావరి బాలోత్సవం నిర్వహిస్తుండగా, తొలిరోజున విద్యార్థినీ విద్యార్థులకు 18 అకడమిక్, 11 కల్చరల్ పోటీలు నిర్వహించారు. కాగా కల్చరల్ విభాగంలో శాస్త్రీయ, జానపద నృత్యాలు, కోలాటం, అభ్యుదయ గీతాలు, లఘు నాటిక, ఏకపాత్రాభినయం, రైమ్స్ తెలుగు ఇంగ్లీష్, అకడమిక్ విభాగంలో చిత్రలేఖనం, కథారచన, వ్యాసరచన, మెమొరీ టెస్ట్, కథా విశ్లేషణ, కవితలు తదితర పోటీలు నిర్వహించారు. కాగా రెండో శనివారం శనివారం, ఆదివారం కలసి రావడంతో గోదావరి బాలోత్సవం పేరుతో రాజమహేంద్రవరం, చుట్టుపక్కల మండలాల స్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు రెండు రోజులపాటు పిల్లల పండుగ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్న నిర్వాహకులకు జిల్లా విద్యాశాఖ నిర్ణయంతో విస్మయానికి గురయ్యారు. సీఎం జగన్ ఇటీవల ఏలూరు జిల్లా దెందులూరు పర్యటనకు వచ్చినపుడు జిల్లా విద్యాశాఖాధికారులు స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. స్కూలు బస్సులన్నింటినీ సీఎం సభకు తరలించారు. ఆ సెలవు కవర్ చేయడానికి రెండో శనివారం స్కూళ్లు తెరవడంతో బాలోత్సవంపై ఆ ప్రభావం పడుతుందని భావించారు. కానీ పిల్లలు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఊపిరిపీల్చుకున్నారు.





రాజమహేంద్రవరంలో జరిగిన గోదావరి బాలోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు.. విద్యార్థిని నృత్య ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాష్ట్రాన్ని జగన్ రూ.8 లక్షల కోట్లు అప్పులు పాలు చేశాడు : గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 10: జగన్ పాలనలో ఈ రాష్ట్రం రూ.8 లక్షల కోట్లు అప్పులపాలైందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో రాష్ట్రంలో 39,450 పరిశ్రమలు వచ్చాయని, ఉద్యోగాలు కూడా 5 లక్షల 13 వేల 351 మందికి వచ్చాయని గుర్తుచేశారు. ప్రస్తుత పాలనలో జగన్ పరిశ్రమలు తీసుకురాకపోగా ఉద్యోగాలు కేవలం 9,158 ఇచ్చారన్నారు. ఆర్థికశాఖ మంత్రి బుగ్గన ఢిల్లీ చుట్టూ తిరగడం తప్ప ఏమీ చేయలేకపోయారని, రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసి అప్పుల అప్పారావుగా మారాడని ఎద్దేవా చేశారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలు చూస్తేనే వైసీపీ పని అయిపోయిందని స్పష్టమైందన్నారు. కోరంలేక సమావేశం గంట వ్యవధిలో ఆగిన విషయాన్ని గుర్తుచేశారు. స్పీకర్ తమ్మినేని వ్యాఖ్యలను గోరంట్ల తప్పుపట్టారు. ఆయన ఎంత దారుణంగా ఏకపక్షంగా వ్యవహరించారో అందరికీ తెలుసునన్నారు. ఇక జగన్ రాష్ట్రంలో వ్యవస్థలన్నీ సర్వనాశనం చేశాడని మండిపడ్డారు. టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వచ్చాక వైసీపీ ప్రభుత్వ అవినీతిపై విచారణ జరిపిస్తామని శిక్షపడేలా చేస్తామన్నారు. రాజమహేంద్రవరం రూరల్‌లో ఐదో కృష్ణుడుగా వచ్చిన మంత్రి మీటింగ్‌లు పెట్టి పంచాయతీ సెక్రటరీలతో రూ.లక్షలు ఖర్చులు పెట్టిస్తున్నారంటూ గోరంట్ల మండిపడ్డారు.

ఎన్నికల నిర్వహణకు నిర్దిష్టమైన చర్యలు : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 10: ఎన్నికల నిర్వహణకు నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. ఎన్నికల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లు, ఎన్నికల సిబ్బంది గుర్తింపు, డేటా నమోదు, తుది ఓటరు జాబితా, ఫారం 6,7,8 ప్రస్తుత పురోగతి తదితర అంశాలపై శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేపట్టిన చర్యలను వివరించారు. జిల్లాలో 395 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్టు చెప్పారు. ఎన్నికల విధులపై సిబ్బందితో పలు దఫాలుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈనెల 15 నాటికి ఆర్వో లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులు పూర్తిచేస్తామని, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌లకు అనువైన భవనాలు గుర్తించామన్నారు. లక్షా 78వేల ఎపిక్ కార్డులు ప్రింటింగ్‌కు పంపడం జరిగిందని కొత్తగా 46,761 ఎపిక్ కార్డుల ప్రింటింగ్‌కి డేటా పంపామన్నారు. ఈ సమావేశంలో రూరల్ ఆర్వో, జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్, అర్బన్ ఆర్వో, కమిషనర్ దినేష్‌కుమార్, కొవ్వూరు ఆర్వో సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, డీఆర్వో జి.నరసింహులు, రాజానగరం ఆర్వో చైత్యవర్షిణి, అనపర్తి ఆర్వో ఎం.మాధురి, గోపాలపురం ఆర్వో శివజ్యోతి పాల్గొన్నారు.

ఆ 'మూడూ'.. చిక్కుముడులే

- వైసీపీలో టెన్షన్ టెన్షన్
- అయోమయంలో అనపర్తి
- గరంగరంగా రాజానగరం
- పలుకులేని నిడదవోలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో నాలుగు స్థానాలకు ఇప్పటికే వైసీపీ ఇంచార్జిలను ప్రకటించింది. దీంతో ఆయా ఇన్చార్జులు నియోజకవర్గాన్ని ఆకట్టుకునే పనిలోపడ్డారు. మిగిలిన మూడు అసెంబ్లీ స్థానాల్లో మాత్రం ప్రతిష్టంభన వీడడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ రాజకీయ బదిలీలకు తెరతీసిన విషయం తెలిసిందే. జిల్లాకొచ్చేసరికి రాజమహేంద్రవరం సిటీ, రూరల్, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాలకు ఇప్పటికే ఆ పార్టీ ఇన్చార్జిలను ప్రకటించింది. కానీ అనపర్తి, రాజానగరం, నిడదవోలు నియోజకవర్గాల్లో మాత్రం ముందడుగు పడడం లేదు. దీంతో ప్రస్తుత సిట్టింగుల భవితవ్యంపై బెట్టింగులూ మొదలయ్యాయి. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఈ మూడు నియోజకవర్గాల బాధ్యులు తమ భవిష్యత్తుపై తీవ్రమైన డైలమాను అనుభవిస్తుంటే, వీరి కేడర్ల పరిస్థితి గందరగోళంగా మారింది. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2008లో రాజానగరం నియోజకవర్గం ఊపిరి పోసుకోగా, రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాలు ఈ నియోజకవర్గం పరిధిలోకి వస్తాయి. 2009, 2014లో రెండుసార్లు ఇక్కడ టీడీపీ విజయకేతనం ఎగురవేసింది. 2019లో ఫ్యాన్ గాలిసురులో వైసీపీకి ఆ సీటు దక్కింది. ఇప్పుడు ఆ నియోజకవర్గానికి వైసీపీ ఇన్చార్జిని ఇంకా ప్రకటించకపోవడం చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గ ఎమ్మెల్యే, తూర్పుగోదావరి వైసీపీ అధ్యక్షుడు జక్కంపూడి రాజా రాజానగరం నియోజకవర్గ వ్యవహారాలు చూస్తున్నారు. ఇప్పుడు ఆయనే మళ్లీ ఆ స్థానంలో ఉంటారా? ఖాళీ చేస్తారా? అనే ప్రస్తావన నలుగుతోంది. జక్కంపూడి రాజా సోదరుడు జక్కంపూడి గణేశ్ పేరు వినిపిస్తున్నా చాలామంది దానిని కొట్టిపారేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో వైసీపీకి సంబంధించి ఇప్పటికే పలువురు సీనియర్ నాయకులు పార్టీకి దూరమయ్యారు. దీంతో అక్కడ అభ్యర్థి ప్రకటన అగమ్యగోచరంగా మారింది. మరోపక్క జనసేన అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటున్న పార్టీ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ ప్రచారంలో వేగం పెంచారు. ఇదిలా ఉండగా రాజానగరం అభ్యర్థిని ప్రకటించకుండా వైసీపీ అధిష్ఠానం సందిగ్ధంలో పెట్టడానికి తెరవెనుక బలమైన కారణం ఉందనే ప్రచారం జనాల నోళ్లలో నానుతోంది. జనసేన నుంచి అగ్రనేత ఈ నియోజకవర్గం బరిలో దిగే అవకాశం ఉందనే ఊహలు చక్కెర్లు కొడుతున్నాయి. ఆ కారణంతోనే సమవుజ్జీని వెతికే పనిలో వైసీపీ పెద్దలు ఉన్నారని చెబుతున్నారు. అసలే అభ్యర్థులు కరువైన సమయంలో కీలకమైన స్థానానికి ఎవరిని ప్రకటించాలా అని తలపట్టుకుంటున్నారట. ఆ పరిస్థితి ఎదురైతే జక్కంపూడి కుటుంబానికి సీటు ఎక్కడ దక్కుతుందో వేచి చూడాల్సిందే. ఇక నిడదవోలు నియోజకవర్గం ఏర్పడిన తర్వాత రెండుసార్లు టీడీపీ నెగ్గింది. 2019లో ఫ్యానుగాలిలో గెడ్డం శ్రీనివాసనాయుడు (జి.శ్రీనివాసనాయుడు) గెలుపు దక్కించుకున్నారు. ఆయన తండ్రి గతంలో కొవ్వూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. అప్పట్లో శ్రీనివాసనాయుడు తండ్రి అంతా తానై నడిపించేవారు. ఇప్పుడు నియోజకవర్గంలోని నాయకులతో సమన్వయం దెబ్బతినడంతో కొందరు నేతల్లో అసంతృప్తి పెరిగింది. చివరికి పార్టీలోని ఆయన సామాజిక వర్గం కూడా ఆయనను మరొకసారి ఒప్పుకునే పరిస్థితి లేదని అంటున్నారు. అయన తీరుపై సొంత కేడర్‌లోని ద్వితీయ శ్రేణి నాయకులు ఆగ్రహం వ్యక్తంచేస్తుండగా.. పార్టీలో స్థానిక బీసీ వర్గం రాజమహేంద్రవరం వచ్చి భరత్ వర్గంలో చేరారనే ప్రచారం సాగుతోంది. స్థానికంగా ఎమ్మెల్యేను వీడి ఎంపీ భరత్‌తో సంబంధాలు కొనసాగిస్తున్నారని సమాచారం. పార్టీ పెద్దలు చేయించిన అంతర్గత సర్వేలో కూడా ఎమ్మెల్యేపై వ్యతిరేకత వ్యక్తమైందని, దీంతో ప్రత్యామ్నాయం వైపు కూడా పార్టీ ఆలోచిస్తోందని ప్రచారం జరుగుతోంది. దాంతో ఇన్చార్జి విషయంలో నిడదవోలు ప్రస్తుతానికి ఉలుకూపలుకూ లేకుండా ఉందనే ఊహాగానాలు జోరుగా వినవస్తున్నాయి. ఇక అనపర్తి నియోజకవర్గం నాలుగుసార్లు టీడీపీకి పట్టం కట్టింది. గత ఎన్నికల్లో ఫ్యాను గాలిలో వైసీపీ నెగ్గేసింది. ఎమ్మెల్యేగా డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తొలిసారి శాసనసభలో అడుగుపెట్టారు. అయితే నియోజకవర్గంలోని అక్రమాలను టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎప్పటికప్పుడు ఏకరువు పెడుతూనే ఉన్నారు. 2020 డిసెంబరు 23న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి సత్య ప్రమాణం చేసినా ఆయన తీరు మాత్రం ఇప్పటివరకూ మారలేదనే విమర్శలున్నాయి. అక్రమ గ్రావెల్, మైనింగ్, భూదందా, పేదలకు ప్రభుత్వం ఇచ్చే గృహాలకు నివాస యోగ్యంకాని భూములను అధిక ధరలకు కొనుగోలుతో అక్రమంగా లాభపడడం, పేకాట క్లబ్బుల్లో వాటాలు తదితర వక్ర మార్గాల్లో ఇక్కడి అధికార పార్టీ నేతలు ప్రజలను దోచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ప్రతిపక్షాలపై బురదజల్లడమే తప్ప తాను చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పలేని పరిస్థితి ఉందని సొంత పార్టీలోనే చర్చ నడుస్తోంది. పది రూపాయల డాక్టర్‌గా సూర్యనారాయణ రెడ్డికి మంచి పేరుంది. కానీ ఇటీవల రంగంపేట మండలం మల్లిపూడిలో ఒక మెడికల్ డిస్పోజబుల్ ఫ్యాక్టరీకి అనుమతులివ్వడంలో ఆయన ప్రమేయం ఉందంటూ స్థానికంగా పెద్ద వివాదం రేగింది. ఇదిలా ఉంటే కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండడంతో వైసీపీ పెద్దలు ఆయనను అనపర్తి నియోజకవర్గం నుంచి బరిలో దింపే ఆలోచన చేస్తున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది.

రద్దుచేసిన రైళ్లను పునరుద్ధరించాలి

- కొవిడ్ సమయంలో కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో 24 రైళ్ల హాల్ట్‌లు రద్దు
- వాటిని తిరిగి నిలుపుదల చేయాలని రైల్వే పరిరక్షణ సమితి డిమాండ్
- కొవ్వూరు నుంచి కలెక్టరేట్ వరకు సమితి సభ్యుల పాదయాత్ర

కొవ్వూరు, ఫిబ్రవరి10: కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో కొవిడ్ కారణంగా రద్దుచేసిన 24 రైళ్లకు తిరిగి హాల్ట్ కల్పించాలని రైల్వే పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. శనివారం 'మన ఊరు-మన సౌకర్యాలు' అంటూ కొవ్వూరు రైల్వేస్టేషన్ నుంచి రోడ్డు కం రైలు బ్రిడ్జి మీదుగా కోటిపల్లి బస్టాండ్, రాజమహేంద్రవరం బస్టాండ్ మీదుగా ఎంపీ భరత్ కార్యాలయం చేరుకుని కార్యాలయ ఇన్‌చార్జికి, అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ 2019 సంవత్సరానికి ముందు కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో 36 రైళ్ల హాల్ట్ ఉండగా 24 రైళ్ల హాల్ట్‌లను ఏకపక్షంగా రద్దు చేయడంతో సామాన్యులు రైలు ప్రయాణ సౌకర్యానికి దూరమయ్యారన్నారు. దీనికితోడు కలెక్టర్ ఆదేశాలతో కొవ్వూరు రోడ్డుకం రైలు బ్రిడ్జిపై ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, లగ్జరీ, సూపర్ లగ్జరీ, ఓల్వో బస్సులను రద్దు చేయడంతో ప్రయాణాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో గతంలో నిలుపుదల చేసే 24 రైళ్లను తిరిగి హాల్ట్ కల్పించాలని, అదేవిధంగా ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, లగ్జరీ, సూపర్‌లగ్జరీ, ఓల్వో బస్సులను కొవ్వూరు బస్టాండుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు, స్థానికులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లలమర్రి మురళీకృష్ణ, కెవికె రంగారావు, చిలంకుర్తి బాబి, పిక్కి నాగేంద్ర, చెరుకూరి సాయిరాజు, కొండపల్లి రత్నసాయి, పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు

త్వరలో పవన్‌కల్యాణ్ రాక

- జనసేనాని ఉభయ గోదావరి జిల్లాల పర్యటన ఖరారు
- ఈనెల 14 నుంచి 17 వరకు పర్యటన
- టీడీపీ నేతలతోను సమావేశమయ్యే అవకాశం
- కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంల్లో మూడురోజులు ఉండేలా ప్రణాళిక



సర్పవరం జంక్షన్(కాకినాడ), ఫిబ్రవరి 10: త్వరలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జిల్లాల పర్యటనకు రానున్నారు. దీనికి సంబంధించి ఉభయ గోదావరి జిల్లాల్లో ఆయన పర్యటన ఖరారైంది. ఈనెల 14వ తేదీ నుంచి 17వరకు భీమవరం, అమలాపురం, కాకినాడ, రాజమహేంద్రవరంల్లో పర్యటించి పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక నాయకులతో భేటీ కానున్నారు. ఈ మేరకు జనసేన పార్టీ రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ మంగళగిరి నుంచి ఒక ప్రకటనలో వివరాలు తెలియజేశారు.

ఎన్నికలపై దిశానిర్దేశం

రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గతేడాది డిసెంబర్ నెలాఖరులో నాలుగురోజులపాటు కాకినాడలో పవన్‌కల్యాణ్ పర్యటించి పార్టీ పటిష్టత, రాబోయే ఎన్నికల్లో అభ్యర్థుల పాత్ర, ప్రణాళికలపై సమాలోచనలు చేసి పార్టీ క్యాడర్‌కు ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా కాకినాడ సిటీపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిన పవన్‌కల్యాణ్ డివిజన్లవారీగా పార్టీ పరిస్థితి, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఇంకా మరో 25 డివిజన్లపై సమీక్ష చేయాల్సి ఉంది. ఈసారి మిగిలిపోయిన డివిజన్లలపై సమీక్ష చేపట్టనున్నారు. జనసేనకు రాజకీయంగా ఈ మూడు జిల్లాలు కీలకం కావడంతో ఇక్కడే అధిక సీట్లు కైవసం చేసుకునేందుకు పవన్ రాజకీయ సమాలోచనలు, ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి కేడర్‌ని ఎన్నికలకు సమాయత్తం చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో వైసీపీకి ఒక్కసీటు రాకుండా చేయాలనే లక్ష్యంతో పవన్ ప్రత్యేకంగా ఇక్కడ దృష్టిసారిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇరుపార్టీల మధ్య సమన్వయం

ఉభయ గోదావరి జిల్లాలో పవన్ ఈనెల 14 నుంచి 17 వరకు ఉంటుంది. ఇందులో తొలి రోజు భీమవరంలో పర్యటన ఉంటుంది. 15, 16 అమలాపురం, కాకినాడలో, 17న రాజమహేంద్రవరంలో పవన్ సమావేశాలు ఉండవచ్చునని సమాచారం. ముఖ్యంగా పవన్ పర్యటనలో జనసేన, టీడీపీ నాయకులతో సమావేశం కానున్నారు. ఇరు పార్టీ నాయకులకు, శ్రేణులకు మధ్య మంచి వాతావరణం ఏర్పాటు చేయడం, పొత్తు ఫలితాల లక్ష్యంగా భేటీలు జరిగే అవకాశాలు ఉన్నాయి. మూడు దశల్లో పవన్ పర్యటనలు నిర్వహించాలని భావించారు. తొలి దశలో ముఖ్య నాయకులు, ప్రభావశీలురు, ముఖ్యులతో సమావేశాలు ఉంటాయి. రెండోసారి పర్యటనలో పార్టీ స్థానిక కమిటీల నాయకులు, కార్యకర్తలు, వీర మహిళల సమావేశాల్లో పాల్గొనేలా కార్యక్రమం ఏర్పాటు చేశారు. మూడోదశలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. ఎన్నికల ప్రచారం చేపట్టే నాటికి మూడుసార్లు ఆయా ప్రాంతాలకు వెళ్లేలా పర్యటన షెడ్యూల్ సిద్ధం చేసుకుంటున్నారు. ఉభయ గోదావరి జిల్లాల పర్యటన తర్వాత ఇతర ప్రాంతాలకు సంబంధించిన పర్యటనలను ఖరారు చేసేందుకు పార్టీ ప్రచార కమిటీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పవన్ పర్యటన ఖరారు కావడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కలగనుంది.

గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పోటెత్తిన భక్తజనం

- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.38.15లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 10: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, ఐశ్వర్య లక్ష్మీహోమం, బాలభోగం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని ఫలపుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా గోవిందనామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారు. తలనీలాలు, కానుకలు తీర్చుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.38.15 లక్షలు లభించినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, కార్యనిర్వహణాధికారి, డీసీ బి.కిషోర్‌కుమార్ తెలిపారు.

భావనారాయణస్వామి తిరునాళ్లకు ఏర్పాట్లు

- నెలరోజుల పాటు మాఘమాస మహోత్సవాలు





భక్తుల దర్శనార్థం ఏర్పాటుచేసిన బారీకేడ్లు, శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 10: ఉమ్మడి జిల్లాలోనే సుప్రసిద్ధ పురాతన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోన్న సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయంలో ఆదివారం నుంచి నెలరోజులపాటు జరిగే తిరునాళ్లకు అన్నిఏర్పాట్లు పూర్తిచేశారు. మాఘమాస మహోత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగే భావనారాయణస్వామి తిరునాళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో జొన్నాడ భీమశంకరరావు, ఆలయ చైర్మన్ పుల్ల నారాయణరావు తెలిపారు. మొదటి ఆదివారం, ఈనెల 18, 25, మార్చి 3, మార్చి 10వ తేదీల్లో తిరునాళ్లు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించు కుంటారని భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బారీకేడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భావనారాయణస్వామి తిరునాళ్లు జరిగే ఆదివారాల్లో ఆలయకమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నేడు దళిత సింహగర్జన సభ

- వేమగిరిలో ఏర్పాట్ల పరిశీలనలో మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 10: సుమారు 15 ఏళ్ల క్రితం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో లక్షలాది మందితో మాలల సింహగర్జన సభ నిర్వహించిన అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ దళిత వర్గాలకు జగన్ పాలనలో జరిగిన అన్యాయాన్ని వెలుగెత్తి చాటేందుకు ఈనెల 11న రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో దళిత సింహగర్జన సభ నిర్వహిస్తున్నారు. ఇందుకు భారీ ఏర్పాట్లుచేశారు. వేదిక, గ్యాలరీలు, సుమారు 30 వేల మంది కూర్చొనే విధంగా సభా ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. జాతీయ రహదారి సమీపంలో వాహనాల పార్కింగ్‌కు కేటాయించారు. ఏర్పాట్లను శనివారంహర్షకుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ ఆపై దళితుల గొంతు నొక్కాడని, 27 దళిత సంక్షేమ పథకాలను రద్దుచేశారని విమర్శించారు. సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారని, మెడికల్ కళాశాలలో దళితులకు కేటాయించిన సీట్లను సైతం అమ్మేసుకున్నారని ధ్వజమెత్తారు. దళిత సింహగర్జనసభకు దళితులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. గద్దం సురేష్, శెట్టిరాజా, సైరాభాను, ఎల్‌వీ ప్రతాప్, పాల్గొన్నారు.



వేమగిరిలో దళిత సింహగర్జనకు ఏర్పాటుచేసిన సభాస్థలి

బాలబాలాజీ స్వామి ఆలయానికి భక్తుల తాకిడి



బాలబాలాజీని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు, ఫిబ్రవరి 10: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తుల తాకిడితో కిటకిటలాడింది. భక్తులు వైనతేయ నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. స్వామివారిని అర్చకులు వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానంలో జరిగిన లక్ష్మీనారాయణ హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శనివారం స్వామివారిని 3,095మంది భక్తులు దర్శించుకుని 2,268మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని ఏసీ జి.మాధవి తెలిపారు. వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాలద్వారా రూ.1,99,558 ఆదాయం వచ్చినట్టు ఏసీ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

శృంగారవల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



పెద్దాపురం, ఫిబ్రవరి 10: కాకినాడజిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధికసంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.3,09,150 అన్నదాన విరాళాలు రూ.73,077ఆదాయం, కేశఖండన ద్వారా రూ.5,920, తులాభారం రూ.650 వెరసి రూ.3,88,797 ఆదాయం సమకూరినట్లు ఆలయవర్గాలు తెలిపాయి.. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు.

హిందూ ధర్మవ్యాప్తికి కృషిచేయాలి

- సత్యదేవుడి సన్నిధిలో గణపతి సచ్చిదానంద సరస్వతి స్వామీజీ



గణపతి సచ్చిదానందకు స్వాగతం పలుకుతున్న ఈవో రామచంద్రమోహన్

అన్నవరం, ఫిబ్రవరి 10: హిందూధర్మ వ్యాప్తికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని మైసూరు దత్త పీఠాధిపతులు గణపతి సచ్చిదానంద సరస్వతి స్వామీజీ అన్నారు. శనివారం అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామీజీకి ఆలయ ఈవో రామచంద్రమోహన్, వేదపండితులు ఆలయమర్యాదలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. దైవారాధన ద్వారానే దైనందిన జీవితంలో పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. సత్యదేవుడి ఆలయం ఎంతో ఖ్యాతి కలిగిందని, ఎప్పటినుంచో ఈక్షేత్రానికి రావాలని సంకల్పం ఉందని స్వామి అనుగ్రహంతో నేటికి నెరవేరిందన్నారు. స్వామీజీకి వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో స్వామివారి ప్రసాదం అందజేశారు.

ఏపీఈఏపీసెట్ కార్యాలయం ప్రారంభం

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 10: కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీఈఏపీసెట్) 2024కు సంబంధించిన కార్యాలయాన్ని శనివారం జేఎన్టీయూకే ఉపకులపతి, ఏపీఈఏపీసెట్ చైర్మన్ జీవీఆర్ ప్రసాదరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇప్పటివరకూ వరుసగా ఏడుసార్లు జేఎన్టీయూకే ఏపీఈఏపీసెట్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించిందన్నారు. త్వరలోనే ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేస్తామన్నారు. కన్వీనర్‌గా వెంకటరెడ్డిని, కోకన్వీనర్లుగా మోహన్‌రావు, నాగేశ్వరరావులను, సమన్వయకర్తలుగా సుమతి, మధు,కృష్ణభాస్కర్‌లను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఏ సీహెచ్‌సాయిబాబు, డీఈ బి.బాలకృష్ణ, సీఈ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

6100 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత



అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

రాజానగరం, ఫిబ్రవరి 10: అక్రమంగా తరలిస్తున్న రూ.31,73,872 విలువగల పీడీఎస్ బియ్యాన్ని శనివారం స్వాధీనం చేసుకున్నట్టు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. రాజానగరం మండలంలోని శ్రీరామనగర్ శివారు నుంచి వ్యాన్‌లో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారంమేరకు సిబ్బందితో కాపుకాచి వాహనాన్ని పట్టుకున్నామన్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా 122 ప్లాస్టిక్ బస్తాల్లో సుమారు 6100 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించామని, వాటి విలువ సుమారు రూ.31,73,872 ఉంటుందన్నారు. ఖమ్మం జిల్లా కల్లూరు గ్రామం నుంచి గొల్లప్రోలు మండలం బి.ప్రత్తిపాడు గ్రామానికి ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్టు వాహన డ్రైవర్ కరణం సద్గురమూర్తి ద్వారా తమ విచారణలో తేలినట్టు రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కె.ఎస్.ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో పీడీఎస్(చౌకబియ్యం) అక్రమనిల్వలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు నాగవెంకటరాజు, జిల్లా పౌరసరఫరాల అధికారి విజయభాస్కర్, రాజానగరం సీఎస్‌డీటీ ఎం.కమల్‌సుందర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఈనెల 15 వరకు కాటన్ బ్యారేజ్‌పై రాకపోకలు నిలిపివేత

- కలెక్టర్ మాధవీలత

ధవళేశ్వరం, ఫిబ్రవరి 10: కాటన్ బ్యారేజ్‌పై రహదారి మరమ్మతుల నేపథ్యంలో మరో ఐదు రోజులు రాకపోకలు నిలిపివేస్తున్నట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఈనెల 10కి పనులు పూర్తిచేసి రాకపోకలు పునరుద్ధరిస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపినా పనులు పూర్తికాకపోవడం, కాంక్రీట్ క్యూరింగ్ వంటి పనులు ఉండడంతో మరో 5రోజులు ట్రాఫిక్‌ను మళ్లించాలని ఇరిగేషన్ అధికారులు కోరారు. ఈ పనుల దృష్ట్యా ఈనెల 15 వరకు బ్యారేజ్‌పై రాకపోకలు నిలిపివేస్తున్నట్టు ఒక ప్రకటనలో తెలుపుతూ ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

- ఆర్ట్స్ కళాశాలలో జీసీటీఏ అధ్యాపకుల రాష్ట్రస్థాయి సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 10: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల జీసీటీఏ సంఘం రాష్ట్రస్థాయి కార్యనిర్వాహక సమావేశం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ అధ్యాపకులు కొత్తగా వస్తున్న టెక్నాలజీలను అందిపుచ్చుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, క్షేత్రస్థాయి పరిశోధనలకు పునరంకితం కావాలని కోరారు. జీసీటీఏ వార్షిక డైరీలను ఆవిష్కరించారు. రాష్ట్ర జీసీటీఏ కార్యదర్శి ఎం.శ్యాంబాబు మాట్లాడుతూ అధ్యాపకులకు సర్వీస్ రెగ్యులరైజేషన్ త్వరగా పూర్తిచేయాలని, సీఏఎస్ ప్రాసెస్ మొదలుపెట్టాలని ఉన్నత విద్యాశాఖను కోరుతున్నట్టు తీర్మానించినట్టు చెప్పారు. వివిధ యాప్‌లపై అధ్యాపకుల నిరసనను పైఅధికారులకు తెలియజేసి సానుకూల స్పందన రాబడతామన్నారు. జీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రాఘవరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి పి.లలితాశరణ్య, వివిధ జిల్లాల సంఘ సభ్యులు పాల్గొన్నారు.



జీసీటీఏ వార్షిక డైరీ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

పెళ్లికార్డులు పంచడానికి వెళ్లి అనంతలోకాలకు..


- ఒంటెద్దుబండిని ఢీకొని వ్యక్తి మృతి

కొత్తపేట, ఫిబ్రవరి 10: మేనకోడలు పెళ్లికార్డులు పంచడానికి వెళ్లి శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కొప్పిగుంట గ్రామానికి చెందిన గుబ్బల నారాయణస్వామికి ఇద్దరు కుమార్తెలు. రెండవ కుమార్తెకు వివాహం నిశ్చయం కావడంతో శనివారం తెల్లవారుజామున బావమరిది అయిన ముమ్మిడివరానికి చెందిన కొప్పిశెట్టి రామసుబ్రహ్మణ్యం(43)తో కలిసి బంధువులకు శుభలేఖలు ఇచ్చేందుకు మోటారు సైకిలుపై కాట్రేనికోన నుంచి బయల్దేరారు. రామసుబ్రహ్మణ్యం నడుపుతుండగా నారాయణస్వామి కూర్చున్నాడు. వానపల్లి సమీపంలో అడ్డుకాలువ వద్దకు వచ్చేసరికి మంచుకురవడంతో ఎదురుగా వెళ్తున్న ఒంటెద్దు బండిని గమనించకుండా నేరుగా ఢీకొట్టడంతో ఇద్దరూ కింద పడిపోయారు. నారాయణస్వామికి స్వల్ప గాయాలు కాగా రామసుబ్రహ్మణ్యానికి తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామసుబ్రహ్మణ్యం మృతి చెందాడు. నారాయణస్వామి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ డి.శశాంక్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



మృతిచెందిన కొప్పిశెట్టి రాంబాబు

ప్రశాంతంగా నవోదయా ప్రవేశపరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పెద్దాపురం, ఫిబ్రవరి 10: పెద్దాపురంలోని జవహర్ నవోదయాలో 9వ తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతగా జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా వ్యాప్తంగా ఆరు పరీక్షా కేంద్రాల్లో 1587 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 1070 మంది విద్యార్థులు హాజరయ్యారని, 517 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదని ప్రిన్సిపాల్ ఆర్.కమలం తెలిపారు.

యెంట్రుకోనలో అల్లుడి వీరంగం

- దాడిలో అత్తతో పాటు మరొకరికి గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిక్కిరెడ్డి నరేష్

అల్లవరం, ఫిబ్రవరి 10: భార్యను కాపురానికి తీసుకెళ్లేందుకు వచ్చిన అల్లుడు వీరంగం చేయడంతో అత్తతోపాటు మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా అల్లవరం మండలం యెంట్రుకోనకు చెందిన తిక్కిరెడ్డి రాజారావు మనవరాలు శిరీషను రాజమహేంద్రవరంలో బ్యాంకు ఉద్యోగం చేస్తున్న బరువు దుర్గాప్రసాద్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. శిరీషను కాపురానికి తీసుకువెళ్లే విషయమై అత్తగారి ఇంటికి వచ్చిన అల్లుడితో ఘర్షణ జరిగింది. దీంతో దుర్గాప్రసాద్ టీవీలు, సామగ్రి ధ్వంసం చేయడం మొదలెట్టాడు. అడ్డు వచ్చిన తిక్కిరెడ్డి నరేష్, అత్త చంద్రావతిలపై దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన వారిద్దరూ అల్లవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దుర్గాప్రసాద్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ చెప్పారు.

వివాహిత అనుమానాస్పద మృతి



చెట్టుకు ఉరివేసుకుని వేలాడుతున్న మహిళ, ఇన్‌సెట్‌లో దుర్గాభవాని

చాగల్లు, ఫిబ్రవరి 10: చాగల్లు శివారు జగనన్న కాలనీకి సమీపంలో మహిళ చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మీనా నగరానికి చెందిన దుర్గాభవాని(25)కి అదే గ్రామానికి చెందిన జాన శివరామకృష్ణతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వారికి మూడేళ్ల అమ్మాయి, రెండేళ్ల అబ్బాయి ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు రావడంతో కొన్నాళ్లగా వేర్వేరుగా ఉంటున్నారు. దుర్గాభవాని పుట్టింటి వద్దనే పిల్లలతో ఉంటుంది. మూడు రోజులుగా కనిపించడం లేదని ఆమె కోసం వెతుకుతున్నారు. శనివారం జీడిమామిడి తోటలో చెట్టుకు వేలాడుతుండడం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ పి.నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

లారీ ఢీ కొని వృద్ధురాలి మృతి

తునిరూరల్, ఫిబ్రవరి 10: లారీ ఢీ కొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన కాకినాడజిల్లా తుని మండలం తేటగుంటలో శనివారం చోటుచేసుకుంది. ఓ షాపు వద్దకు సిమ్మెంటు లోడుతో వస్తున్న లారీ వెనుక నుంచి కొల్లి నారాయణమ్మ(60) ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఘటనపై కేసు నమోదుచేసి లారీని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ బి.రమేష్‌బాబు తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

తుని రూరల్, ఫిబ్రవరి 10: తుని మండలం ఎర్రకోనేరు గ్రామానికి చెందిన పప్పు త్రిమూర్తులు(32)తుని పట్టణంలో పురుగుల మందు తాగి మృతి చెందినట్టు ఎస్ఐ రామలింగేశ్వరరావు తెలిపారు. త్రిమూర్తులు ఒక యువతితో వివాహేతర సంబంధం పెట్టుకుని బ్యాంక్ కాలనీలో నివాసం ఉంటున్నారు. అయితే ఇరువురు మధ్య గొడవలు చోటు చేసుకోవడంతో శుక్రవారం యువతికి పురుగుల మందు తాగించి త్రిమూర్తులు తాగాడు. దీంతో ఇద్దరు అపస్మారక స్థితికి చేరుకోవడంతో ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం త్రిమూర్తులు మృతి చెందగా యువతి కోలుకుంటున్నట్లు ఎస్ఐ రామలింగేశ్వరరావు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

‘16న రవాణా రంగం బంద్’

కొవ్వూరు, ఫిబ్రవరి 10: ఈ నెల 16న రవాణా రంగం బంద్ చేపట్టినట్టు ఐఎఫ్‌టీయూ నాయకులు పి.నాగేశ్వరరావు, సీహెచ్ రమేష్ తెలిపారు. శనివారం కొవ్వూరు మండలం పంగిడి గ్రామంలో లారీ డ్రైవర్లతో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఐపీసీ 304 ప్రకారం రోడ్డు ప్రమాదం జరిగితే రెండేళ్ల జైలు శిక్ష విధించేవారని, కొత్త చట్టం ప్రకారం ఐదేళ్లకు పెంచారన్నారు. రూ.7లక్షల జరిమానా విధిస్తారన్నారు. ఈ చట్టాన్ని నిరసిస్తూ ఈ నెల 16న రవాణా రంగం బంద్ చేయాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయన్నారు.

ఏజెన్సీ సమాచారం

జగన్ అరాచకాలపై లోకేశ్ పూరించిన నాధమే శంఖారావం

● మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి



రంపచోడవరం, ఫిబ్రవరి10: జగన్మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పూరించిన నాధమే శంఖారావమని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వంతల రాజేశ్వరి అన్నారు. యువగళం పాదయాత్రలో లోకేశ్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావంతో పర్యటించి జగన్ ప్రభుత్వ దౌర్జన్యాలపై ప్రజలకు వవరించనున్నారన్నారు. రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకే 'శంఖారావం' కార్యక్రమం శ్రీకారం చుట్టార న్నారు. జగన్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, అరాచకపాలనపై గొంతెత్తి ప్రజలకు మద్దతుగా నిలిచారని, వైసీపీ నేతల అవినీతి అన్యాయాలకు వ్యతిరే కంగా 220 రోజులపాటు 3,132 కిలోమీటర్లు పాద యాత్ర చేశారన్నారు. శంఖా రావంద్వారా పార్టీ కార్యకర్తలు లోకేశ్ వైపు మరింత చేరువయ్యేలా చేస్తుందని, కార్యకర్తలు నేరుగా లోకేశ్‌తో తమ అభిప్రాయాలు పంచుకొనే అవకాశం ఉంటుందన్నారు.

పోలవరం పరిహారం చెల్లించాలి

చింతూరు, ఫిబ్రవరి 10 : పోలవరం ముంపు ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయిలో పోలవరం పరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. శనివారం చింతూరులో ఏర్పాటుచేసిన సీపీఎం మండలస్థాయి కార్యకర్తల సమా వేశంలో మాట్లాడారు. వరదల కారణంగా చింతూరు డివిజన్ ప్రజలు ప్రతిఏటా నానా అవస్థలుపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ముంపు బాధితులకు సురక్షితమైన సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికలలో బీజేపీ దాని మిత్రపక్షాలకు బుద్ధి చెప్పాలని ఆయన అన్నారు. బీజేపీ రాష్ట్రానికి తీరని ద్రోహం తలపెట్టిందని ఆయన ఆరోపించారు. అటువంటి పార్టీకి మద్దతు ఎలా ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు. జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని దివాళా తీయించాడన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జెండా దిమ్మను కూల్చడంపై ఫిర్యాదు



జెండా దిమ్మను కూల్చుతున్న దృశ్యం

వై.రామవరం, ఫిబ్రవరి 10: అల్లూరి జిల్లా వై.రామవరం మండలం చవిటిదిబ్బలలో తెలుగుదేశంపార్టీ జెండా దిమ్మను కూల్చివేశారని స్థానిక వైసీపీ మండల అధ్యక్షుడిపై తెలుగుదేశం కార్యకర్తలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వీకా నరసన్నదొర, క్లస్టర్ ఇన్‌చార్జి కె.సత్యనారాయణదొర, యూనిట్ ఇన్‌చార్జి కాంతారెడ్డి తదితరులు ఫిర్యాదు చేశారు. ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకుని ఉన్న స్థలంలో గత 38 సంవత్సరాలుగా పార్టీ జెండాను ఎగురవేసి కార్యక్రమాలు జరుపుతున్నామని ఆ దిమ్మను ఈనెల 6వతేదీన అక్రమంగా కూల్చివేశారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. కూల్చివేసిన స్థలంలో సమోసాల కొట్టు నిర్వాహణకు అద్దెకు ఇచ్చారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు విచారణచేసి టీడీపీ దిమ్మను పునర్‌నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా సేవా కార్యక్రమాలు



వైద్యశిబిరం ప్రారంభిస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 10: ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా తాము సేవా కార్యక్రమాలు చేస్తున్నామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. నగరంలో వరుసగా నాల్గవరోజు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో రాజమహేంద్రవరం 50వ డివిజన్‌లో శనివారం భవానీ చారిటబుల్‌ట్రస్ట్, వాసవీశ్రీ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. దీనిని ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో ప్రజల ఆరోగ్యం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. చంద్రన్న బీమా ద్వారా లక్షలాది మందిని ఆదుకుంటామన్నారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పేదల వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం బిల్లులు చెల్లించకపోవడంతో ఆసుపత్రుల్లో శస్త్ర చికిత్సలు కూడా ఆగుతున్నాయని చెప్పారు. వేలకోట్లు పెండింగ్‌లో పెడితే కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం ఎలా అందుతుందని ప్రశ్నించారు. టీడీపీ డాక్టర్స్ సెల్ పార్లమెంట్ కమిటీ అధ్యక్షుడు యాళ్ల ప్రదీప్ మాట్లాడుతూ ఉచితమెగా వైద్యశిబిరాలు నిర్వహించేందుకు నగరంలో పేదలు నివశించే ప్రాంతాలను ఎంచుకుంటున్నామని చెప్పారు. అనంతరం వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకున్న ప్రజలకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్‌తో కలిసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డిమణి, ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకి రామయ్య, మాజీ కార్పొరేటర్ కడలి రామకృష్ణ, బాబీ, యిన్నమూరి రాంబాబు, టీడీపీ నాయకులు సంసాని ప్రసాద్, రాయి అప్పన్నబాబు, మిస్కా జోగినాయుడు, కొల్లి బుజ్జి, వేణు, అనేం చిన్ని, రేగేటి , పితాని కుటుంబరావు, చాపల చిన్నరాజు, బేసరి చిన్న, ఆనంద్ పాల్గొన్నారు.

ప్రారంభమైన పంచాయతన పూర్వక సూర్యారాధన

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 10: మాఘమాసం సందర్భంగా నిర్వహించ తలపెట్టిన షోడశ దిన ప్రయుక్త పంచాయతన పూర్వక సూర్యారాధనకు శనివారం శ్రీకారం చుట్టారు. స్థానిక సీతంపేటలోని యాగస్థలంలో చేసిన ఏర్పాట్ల మధ్య యాగ నిర్వాహకులు వడలికుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. హోమాది కార్యక్రమాలు అనంతరం సూర్య తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈనెల 25వ తేదీ వరకు ప్రతిరోజు 7 గంటలకు సూర్యనమస్కారాలు, హోమాలు, శత చండిపారాయణ, హోమం, సుదర్శన మంత్రానుష్టానం, శ్రీలక్ష్మీగణపతి జపం, చతురావృతి తర్పణ, అష్ట ద్రవ్యహోమాలు, రుద్రాభిషేకం, హోమం, ఉదయం 9గంటలకు కుంకుమార్చన జరుగుతాయని తెలిపారు. రథసప్తకి ఆరాధనలు, 14 నుంచి 18వరకు శ్రీమహాలక్ష్మి ఆరాధనలు, తామరపువ్వులతో హోమాలు, 13న వరసిద్ధి వినాయక కళ్యాణం, 15న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం, 17న శ్రీ రమాసమేత సత్యనారాయణ స్వామి కల్యాణం, 19న శివపార్వతుల కల్యాణ్యం, 21న లక్ష్మీనారాయణ కల్యాణం, 23న సూర్యకల్యాణ్యం ,24న జ్యోతిర్లింగార్చన, 25న మహాపూర్ణాహుతి అనంతరం పదివేల మందికి అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు కుమార్ శర్మ తెలిపారు.

కంటిపూడిగ్రూప్స్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్

రాజమహేంద్రవరంసిటీ, ఫిబ్రవరి 10: కంటిపూడి గ్రూప్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్‌మీట్‌ను నిర్వహించారు. కంటిపూడి కియా మోటార్స్, నిస్సాన్, స్టీల్స్ సుజుకీ సంస్థలలోని ఉద్యోగస్తులకు ప్రత్యేకంగా స్పోర్ట్స్‌మీట్‌ను నిర్వహించారు. రాజమహేంద్రవరం, కాకినాడ టీమ్స్ ఇందులో పాల్గొన్నాయి. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, డాడ్జిబాల్, త్రోబాల్, రన్నింగ్, లాంగ్ జంప్, మ్యూజికల్ కోన్స్, లెమన్ అండ్ స్పూన్, బ్యాడ్మింటన్, టగ్ ఆఫ్ వార్ పోటీలు రాజానగరం కియా బాడీషాప్ వద్ద జరిగాయి. ఈ స్పోర్ట్స్‌మీట్‌ను కంటిపూడి సర్వారాయుడు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా కంటిపూడి సర్వారాయుడు, డైరెక్టర్స్ సీహెచ్‌వీవీ సత్యనారాయణమూర్తి (చినబాబు), కె.వినయ్‌బాబు, ఎం.జగన్, కె.మన్మోహన్‌రామ్ పాల్గొన్నారు. బీజీలైఫ్‌లో ఉన్న ఉద్యోగులంతా ఆటవిడుపుకోసం ఈ స్పోర్ట్స్‌మీట్ నిర్వహించామన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన వారికి ముఖ్యఅతిథుల చేతుల మీదుగా బహుమతులు అందించారు.



కంటిపూడి స్పోర్ట్స్ మీట్‌లో విజేతలు

టీడీపీ-జనసేన కార్యకర్తలపై దాడికి నిరసన



కోరుకొండలో నిరసన తెలుపుతున్న జనసేన, టీడీపీ నాయకులు

» పోలీసుల తీరును వ్యతిరేకిస్తూ డీఎస్పీ కార్యాలయం వద్ద ధర్నా

కోరుకొండ, ఫిబ్రవరి 10: అధికార పార్టీ అండదండలతో శ్రీరంగపట్నం గ్రామంలోని జనసేన, టీడీపీ కార్యకర్తలను అకారణంగా దాడి చేయడాన్ని ఖండిస్తూ కోరుకొండ డీఎస్పీ కార్యాలయం వద్ద శనివారం సాయంత్రం జనసేన ఇన్‌చార్జ్ బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు టీడీపీ, జనసేన నాయకులు న్యాయం కోసం నిరసన తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని శ్రీరంగపట్నంలో ఐదేళ్లుగా జనసేన, టీడీపీకి చెందిన సానుభూతిపరులు, గ్రామస్థులు వాలీబాల్ ఆడుకుంటున్నారు. ఆ స్థలంలో నేడు అధికార పార్టీ అండదండలతో పోలీసులు అకారణంగా ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా గ్రామస్థులపై విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచారన్నారు. విషయం తెలిసిన వెంటనే బలరామకృష్ణ, పలువురు టీడీపీ, జనసేన నాయకులు సంఘటనా స్థలానికి చేరుకుని దాడిని ఖండించారు. బాధితులకు న్యాయం జరగాలని ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని నార్త్‌జోన్ డీఎస్పీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తనకాల నాగేశ్వరరావు, మల్ల అవతారం, బదిరెడ్డి రాజా, బుద్దా బాపూజీ, తాడి శ్రీను, బుద్ద బ్రహ్మాజీ, సూరిశెట్టి సుబ్బారావు, కర్రి శ్రీను, కొయిడాల గంగయ్య, సూరిశెట్టి చిన్నారి, తాడి సీతయ్య, అడ్డాల శ్రీను, దేవనదుర్గప్రసాద్, మణికంఠస్వామి, తోట అనీల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ అరాచకాలపై లోకేశ్ శంఖారావం

» టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఫిబ్రవరి 10: జగన్ అరాచకాలపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పూరించిన నాదమే రేపటి నుంచి ప్రారంభమౌతున్న శంఖారావమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం అనపర్తిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శంఖారావం కార్యక్రమం 50రోజుల పాటు 120 నియోజకవర్గాల్లో జరుగుతుందని, వైసీపీ ఐదేళ్లుగా సాగిస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలను ప్రజలకు వివరిస్తూ పర్యటన చేయనున్నారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, మామిడిశెట్టి శ్రీను, ఒంటిమి సూర్యప్రకాష్, నూతిక బాబూరావు, సత్తిరెడ్డి వెంకన్నబాబు, వీర భాస్కరరెడ్డి, బాసి పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న ప్రకటనపై హర్షం

భారత మాజీ ప్రధాని, బహు భాషా కోవిదుడు పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం తెలుగు జాతికి గర్వకారణమని, ఆయన ప్రధానిగా చేపట్టిన అనేక సంస్కరణలు దేశాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించాయని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పీవీ తెలుగు భాషతో బాటు 14 భాషల్లో పట్టును సాధించిన మహనీయుడని, ఆయన తెలుగువాడు కావడం ప్రతి తెలుగు వాడు గర్వించాలని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: సీఐ



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ శివగణేష్

అనపర్తి, ఫిబ్రవరి 10: ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సీఐ పి.శివగణేష్ సూచించారు. జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం అనపర్తిలోని లారీ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన విచ్చేసి ప్రసంగించారు. వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని, వాహనాలు నడిపేటపుడు సెల్‌ఫోన్ మాట్లాడడం, మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామారావు, లారీ యూనియన్ ప్రతినిధులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గోరంట్ల పరామర్శ

ధవళేశ్వరం, ఫిబ్రవరి 10: స్థానిక టీడీపీ నాయకుడు కొమ్మిశెట్టి వీర్రాజు తల్లి సత్యవతి(88)వృద్ధాప్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శనివారం పరామర్శించారు. వీర్రాజు, కుటుంబసభ్యులను పరామర్శించి ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పందూరి అప్పారావు, ఆళ్ళ ఆనందరావు, నాళ్ళ రమేష్, పొరోజు మాణిక్యాలరావు, బత్తిన బ్రదర్స్, ఆళ్ళ విఠల్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు



అనపర్తిలోని పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వేద పండితులు

అనపర్తి, ఫిబ్రవరి 10: అనపర్తిలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ సందర్భంగా శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పాంచగవ్యప్రాసన, రక్షాదారణ కార్యక్రమాలు చేపట్టారు. ఆదివారం ఆలయ శిఖర ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు, అన్న సమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి వీరభద్రరావు దరఖాస్తు



నిడదవోలు, ఫిబ్రవరి 10: నిడదవోలు నియోజకవర్గం నుంచి 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తన దరఖాస్తును పరిశీలించాలని తణుకుకు చెందిన పూలమాల వీరభద్రరావు విజ యవాడలోని పార్టీ కేంద్ర కార్యాల యంలో దరఖాస్తు అందించినట్టు శనివా రం నిడదవోలులో విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. నిడదవోలు పురపాలక సంఘంలో సుదీర్ఘకాలం ప్రభుత్వ ఉద్యోగిగా సేవలందించి 2021లో రిటైర్ అయ్యానన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ద్వారా నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాలనుకుంటున్నానని ఆయన చెప్పారు.

జేగురుపాడులో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

ఈనెల 13న ప్రారంభానికి ఏర్పాట్లు



సబ్‌స్టేషన్ ప్రారంభ ఏర్పాట్లును పరిశీలిస్తున్న సర్పంచ్ స్టాలిన్

కడియం, ఫిబ్రవరి 10: జేగురుపాడులో రూ.3.58 లక్షలతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఈనెల 13న ప్రారంభం కానుందని సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ తెలిపారు. శనివారం ఆయన ప్రారంభోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో గ్రామంలో ప్రజలకు నిరంతరం విద్యుత్ అందుతుందన్నారు. సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

50 ఏళ్లకే పెన్షన్ సౌకర్యం కల్పించాలి

ఊనగట్ల సమావేశంలో నాయీ బ్రాహ్మణసేవా సమితి

చాగల్లు, ఫిబ్రవరి 10: కులవృత్తి చేసుకుని జీవనం సాగిస్తున్న నాయీ బ్రాహ్మణులకు 50 ఏళ్లకే పెన్షన్ సౌకర్యం కల్పించాలని నాయీ బ్రాహ్మణసేవా సమితి సభ్యులు కోరారు. ఊనగట్లలో శుక్రవారం జరిగిన సమావేశంలో కులవృతి చేయడం వల్ల కంటి చూపు మందగించి వృత్తికి దూరమవుతున్నారని సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాలకు సంబంధించి నూతన కార్యవర్గాలను ధూపాటి శ్రీనివాస్ ప్రకటించి సభ్యులతో ప్రమాణం చేయించారు. మూడు నియోజకవర్గాలకు సంబంధించి ఉమ్మడి అధ్యక్షుడిగా ధూపాటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా తణుకు సూరి బాబు ప్రమాణస్వీకారం చేశారు. కాగా కొవ్వూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా తుమ్మలపల్లి వెంకట నారాయణ, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి సత్యన్నారాయణ, నిడదవోలు నియోజకవర్గ అధ్యక్షుడిగా కొండేపాటి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా తాడిమల్ల వెంకటేశ్వరరావు, గోపాలపురం నియోజకవర్గ అధ్యక్షుడిగా అరిగెల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా కె. సత్యనారాయణలను ఎన్నుకున్నారు.

కొవ్వూరులో జనసేనాని పర్యటన ఏర్పాట్లు



నందమూరు రోడ్‌లో లేఅవుట్‌లను పరిశీలిస్తున్న జనసేన నాయకులు

కొవ్వూరు, ఫిబ్రవరి 10: సార్వత్రిక ఎన్నికల నేపథ్యం లో కొవ్వూరులో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పర్యటనకు సంబంధిం చి సభా ప్రాంగ ణం, హెలీప్యాడ్ ప్రాంతాలను శనివారం జనసేన నా యకులు పరిశీలించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు ఆధ్వర్యంలో నందమూరు రోడ్‌లో సభావేదిక, హెలీప్యాడ్‌కు అనువైన లేఅవుట్లను పరిశీలించారు. కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా ప్రోగాం కమిటీ మెంబర్ మాణికిరెడ్డి తేజస్, దేగల రాము, గంగుమళ్ల స్వామి, కె.రామాంజనేయులు పాల్గొన్నారు.

పంగిడిలో ‘పల్లెకు పోదాం’



పంగిడిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

కొవ్వూరు, ఫిబ్రవరి 10: రానున్న ఎన్నికల్లో బీజేపీకి మద్దతిచ్చి నరేంద్రమోదీని మరోసారి ప్రధానిని చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమిరాధ అన్నారు. కొవ్వూరు మండలం పంగిడిలో శనివారం పల్లెకు పోదాం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రచారం చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ప్రభాస్ యోజన కన్వీనర్ బూసి బెనర్జి, మండలాధ్యక్షుడు పెరుగు పోతురాజు, మణికంట తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక.. కొవ్వూరు జనసేన నాయకుడు గండ్రోతు పవన్ సోమరాజు బీజేపీలో చేరారు. కొవ్వూరు అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు సమక్షంలో రాజమహేంద్రవరంలో బీజేపీ కం డువా కప్పుకున్నారు. కార్యక్రమంలో రేలంగి శ్రీదేవి, ప్రభుజీ, పిల్లలమర్రి మురళీకృష్ణ, పిక్కి నాగేంద్ర, గోపిశెట్టి శివకృష్ణ, పెరుగు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం ఆర్వోగా శివజ్యోతి

గోపాలపురం, ఫిబ్రవరి 10: గోపాలపురం నియోజకవర్గ ఆర్వోగా కేఎల్ శివజ్యోతి శనివారం నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ కే.మాధవిలతను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల నిర్వహణకు నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించినట్టు తెలిపారు. ఇప్పటివరకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన తనను బదిలీపై జిల్లాకు పంపించారన్నారు. ఇప్పటివరకు ఇక్కడ ఈఆర్వోగా బాధ్యతలు నిర్వహించిన ఎం.వెంకటసుధాకర్ ఓఎన్‌జీసీ ఎస్‌డీసీగా బాధ్యతలు చేపట్టినట్టు తెలిపారు.

కోడి పందాలు ఆడుతున్న 16 మంది అరెస్టు

రెండు కోళ్లు, రూ.7150 నగదు, ఏడు బైక్‌లు, స్వాధీనం

చాగల్లు, ఫిబ్రవరి 10: మండలంలోని చిక్కాల పామాయిల్ తోటలో కోడి పందాలు ఆడుతున్న 16 మందిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ పి.నాగరాజు తెలిపారు. శుక్రవారం రాత్రి సిబ్బందితో కలిసి దాడి చేసి కోడి పందాలు ఆడుతున్న వారిని అరెస్టు చేసి వారి నుంచి రెండు కోళ్లు, రూ.7150 నగదు, ఏడు మోటారు సైకిళ్లు, స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

మోదీపై అనుచిత వ్యాఖ్యలకు బీజేపీ నిరసన

రాజమహేంద్రవరంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం



రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 10: ప్రధాని నరేంద్రమోదీ బీసీ కాదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసిస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శనివారం రాజమహేంద్రవరం కంబాలచెరువు సెంటర్లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యసాయిరాం మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని కాంగ్రెస్ పార్టీ ఓర్వలేకపోతోందని విమర్శించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురగంటి సతీష్ మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల రామకృష్ణారావు, పడాల నాగరాజు, కందికొండ రమేష్, మన్నెం శ్రీనివాస్, పిల్లాడి రుద్రయ్య, వీరా వీరాంజనేయులు, డాక్టర్ అనురాధ పాల్గొన్నారు.

బెస్తా వీధిలో ముత్యాలమ్మ జాతర

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 10: స్థానిక బెస్తా వీధిలో ఈ నెల 11వ తేదీన రజక సంక్షేమ సేవాసంఘం ఆధ్వర్యంలో శ్రీ ముత్యాలమ్మ జాతర జరగనుంది. ఉదయం అభిషేకం, కుంకుమ పూజలు, సాయంత్రం 4 గంటలకు అమ్మవారి ఊరేగింపు జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు బుడంపర్తి నాగేశ్వరరావు, అత్తిలి శ్రీనివాసరావు, దువ్వాపు సూర్యనారాయణ బాబు, బుడంపర్తి సురేష్, కాకరపర్తి శ్రీనివాస్ తదితరులు తెలిపారు.

టీటీడీ సహకారంతో ఆలయాల అభివృద్ధికి చర్యలు

పలు ఆలయ కమిటీలకు చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కోరుకొండ, ఫిబ్రవరి 10: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు ద్వారా రాజానగరం నియోజకవర్గంలోని 115 దేవాలయాల అభివృద్ధికి రూ.11.5కోట్లు మంజూరైనట్టు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పేర్కొన్నారు. దీనిలో భాగంగా శనివారం రూ.45.44 లక్షల చెక్కులను పలు గ్రామాల్లోని ఆలయ కమిటీ సభ్యులకు ఆయన అందజేశారు. మండలంలోని జంబుపట్నంలో నిర్మిస్తున్న శివాలయానికి రూ.8 లక్షలు, కూనవరంలో శ్రీకృష్ణ ఆలయ కమిటీకి రూ.6.72 లక్షలు, నామవరంలో శ్రీకృష్ణ ఆలయానికి రూ.6.72 లక్షలు, కొత్తతుంగపాడులో విఘ్నేశ్వరాలయానికి రూ.8 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వుల్లి అప్పన్నదొర, నాగా సత్యనారాయణ, ఎంపీపీ వుల్లి సూర్యకుమారి, వుల్లి పట్టాభిరామయ్య, వుల్లి చల్లారావు, నాగా రమేష్, వుల్లి గణనాథరావు, తోరాటి సత్యప్రసాద్, చిట్నీడి వెంకటేశ్వరరావు, నాగ శేషగిరి పాల్గొన్నారు.

‘తోట’ తీరుతో వైసీపీకి పలువురి రాజీనామా

టీడీపీలో చేరుతున్నట్టు ప్రకటన



మాట్లాడుతున్న వైసీపీ కార్యకర్తలు

గోకవరం, ఫిబ్రవరి 10: వైసీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం వ్యవహారశైలి నచ్చక పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు మండలంలోని రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు తెలిపారు. ఈ మేరకు శనివారం గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నరుకుల నాగబాబు, కసిరెడ్డి రవిబాబు, నరుకుల రాజబాబు, కసిరెడ్డి సతీష్ తదితరులు మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన నరసింహం నాయకులకు, కార్యకర్తలకు సమాచారం ఇవ్వకుండానే పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, నాయకులు, కార్యకర్తలు మనోభావాలు దెబ్బతినేలా వ్యవహస్తున్నారంటూ మండిపడ్డారు. సుమారు 100 మంది కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సమక్షంలో త్వరలో టీడీపీలోకి చేరుతున్నామని వారు ప్రకటించారు.

భూమి అమ్ముతామని డబ్బు తీసుకుని మోసం

అన్నదేవరపేటకు చెందిన నలుగురిపై కేసు

కొవ్వూరు, ఫిబ్రవరి 10: భూమి అమ్ముతామని డబ్బు తీసుకుని మోసం చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. కొవ్వూరుకు చెందిన గన్నిపూడి శ్రీదేవికి తాళ్లపూడి మండ లం అన్నదేవరపేటకు చెందిన మేన్ని చంద్రమోహన్, నాగభువన తమ అర ఎకరం భూమి విక్రయిస్తామని నమ్మించి 2017 నవంబరు 8వ తేదీన రూ.4.70 లక్షలు తీసుకుని భూమి రిజిస్ట్రేషన్ చేయలేదు. దీనిపై పెద్దల్లో పెట్టినా, స్పందనలో ఫిర్యాదుచేసిన భూమి రిజిస్ట్రేషన్ చేయలేదు. వాటన్నిటిని దృష్టిలో పెట్టుకుని చంద్రమోహన్, నాగభువన, వారి కుమారులు నాగార్జున, మహేష్‌లు శ్రీదేవి ఇంటికి వచ్చి భూమి అగ్రిమెంటు కాగితాలు ఇవ్వాలని, లేకుంటే చంపుతామని బెదిరించడంతో శ్రీదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నలుగురిపై కేసునమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

అనపర్తి, ఫిబ్రవరి 10: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోం దని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలో ఇటీవల నిర్మించిన పలు సీసీ రోడ్లను, మంచినీటి పథకాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఎస్ఎంఎం బాలకృష్ణారెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

మరో ఐదు రోజులు..

ఈనెల 15 వరకు కాటన్ బ్యారేజ్‌పై
రాకపోకలు నిలిపివేత
కలెక్టర్ మాధవీలత వెల్లడి

త్వరలో పవన్ రాక

- జనసేనాని ఉభయ గోదావరి జిల్లాల పర్యటన ఖరారు
- ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు పర్యటన
- టీడీపీ నేతలతోనూ సమావేశమయ్యే అవకాశం
- కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంలలో మూడు రోజులపాటు ఉండేలా ప్రణాళిక

ఉభయగోదావరి జిల్లాల్లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు పర్యటిస్తారు. ఇందులో తొలిరోజు భీమవరంలో పర్యటన ఉంటుంది. 15, 16 అమలాపురం, కాకినాడలో, 17న రాజమహేంద్రవరంలో పవన్ సమావేశాలు ఉండ వచ్చని సమాచారం. జనసేన నియోజకవర్గాల వారీ సమీక్షలు, టీడీపీ నాయకులతో భేటీలు ఉంటాయి.





నేడు రాజమహేంద్రవరంలో దళిత సింహగర్జన సభ

- భారీగా ఏర్పాట్లు.. 30 వేల మందికి కూర్చునేలా సౌకర్యాలు
- దళితులకు జరిగిన అన్యాయాన్ని ప్రపంచానికి చాటేందుకే సభ
- 27 పథకాలు రద్దు చేసిన జగన్‌పై యుద్ధం
- ఏర్పాట్ల పరిశీలనలో మాజీ ఎంపీ హర్షకుమార్



కొవ్వూరు గోదావరి గట్టు కాటన్ విగ్రహం నుంచి రైల్వే స్టేషన్ వరకు పట్టాల చెంతనే వేసిన చెత్త నుంచి పొగలు





రైల్వేస్టేషన్ రోడ్డులో చెత్తకు నిప్పు పెట్టడంతో వస్తున్న పొగ.. (పక్కన) కాటన్ విగ్రహం వద్ద పోలీస్‌స్టేషన్‌కు ఇచ్చిన స్థలంలో నిల్వ ఉన్న వర్షపు నీరు

ఈ దహనకాండ ఆరేదెన్నడు..

- కొవ్వూరులో అడుగడుగునా రోడ్ల పక్కనే చెత్త డంపింగ్
- పట్టణంలో ప్రతి చోటా మండుతున్న చెత్త కుప్పలే దర్శనం
- ప్రస్తుతం రైలు పట్టాల చెంతనే చెత్త డంపింగ్ చేసి దహనం
- తగలబెట్టడంతో వ్యాపిస్తున్న పొగతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- దశాబ్దాలకాలంగా పట్టణంలో తీరని డంపింగ్ యార్డు సమస్య
- మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వనిత హయాంలో పూర్తి నిర్లక్ష్యం

కొవ్వూరు, ఫిబ్రవరి 10 : కొవ్వూరు మున్సిపాల్టీలో డంపింగ్ యార్డు సమస్యకు దశాబ్దాలుగా పరిష్కారం లభించడం లేదు. హోంమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం అయినా చెత్త సమస్య అలానే ఉంది. నియోజకవర్గంలో ఏ రహదారి చూసినా చెత్తపోసి తగలబెట్టిన దృశ్యాలే దర్శనమిస్తున్నాయి. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన కొవ్వూరు పట్టణంలో శాశ్వత డంపింగ్ యార్డు లేకపోవడంతో ఇంటింటా సేకరించిన చెత్తను గోదావరి గట్టుపై కాటన్ విగ్రహం నుంచి రైల్వేస్టేషన్ వరకు మినీబైపాస్‌లో రోడ్డుకు ఇరుపక్కల పోస్తున్నారు. చెత్తను రహదారి వెంబడి పారబోసి తగలబెట్టడంతో రోడ్డంతా దట్టంగా పొగ వ్యాపించి ఎదుటవచ్చే వారు కొందరు కనిపించక ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. ఆ రహదారిలో ప్రయాణించాలంటే ముక్కు మూసుకోవాల్సిందేనని ప్రజలు వాపోతున్నారు. కొవ్వూరు పట్టణాన్ని ఆనుకుని లేఅవుట్‌లు వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్న అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు మున్సిపల్ డంపింగ్ యార్డుకు కనీసం 5 ఎకరాల స్థలం సేకరించలేకపోతున్నారా అంటూ ప్రజలు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. కొవ్వూరు పట్టణానికి ఆరు దశాబ్దాలుగా డంపింగ్ యార్డు సమస్యగా మారింది. 1965 ఫిబ్రవరి 1న కొవ్వూరు పురపాలక సంఘం ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటిదాకా ఇంటింటా సేకరించిన చెత్తను వేయడానికి డంపింగ్ యార్డుకు స్థలసేకరణ చేయడంలో అధికారులు, నాయకులు వైఫల్యం చెందారు. 16.23 కిలోమీటర్లు విస్తరించి ఉన్న కొవ్వూరు పట్టణంలో 23 వార్డులు సుమారు 60 వేలకు పైగా జనాభా, 13 వేల నివాస గృహాలు ఉన్నాయి. 23 వార్డుల నుంచి ప్రతిరోజు 23 టన్నులు చెత్త వచ్చి పడుతుంది. 2013-14లో నందమూరు రోడ్‌లో సుమారు 2 ఎకరాల భూసేకరణ చేసి, దానికి సంబంధించి చెల్లించవలసిన సొమ్మును మున్సిపల్ అధికారులు రెవెన్యూ శాఖకు సుమారు రూ.30 లక్షలు జమ చేశారు. అంతా సవ్యంగా జరుగుతుందన్న సమయంలో డంపింగ్ యార్డుకు సేకరిస్తున్న భూయజమాని రేటు విషయంలో కోర్టును ఆశ్రయించడంతో డంపింగ్ యార్డు సమస్య ఎక్కడికక్కడ నిలిచిపోయింది. అప్పటివరకు 1వ వార్డు రాజీవ్‌కాలనీలో నివాసాలను ఆనుకుని ఉన్న మున్సిపల్ చెరువును పూడ్చివేసి చెత్తను తాత్కాలికంగా డంపింగ్ చేసేవారు. వర్షాకాలంలో పారిశుధ్య సిబ్బంది చెత్తను రోడ్డుపై పారవేయడంతో దుర్గంధం వెదజల్లుతోందని కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొవ్వూరు మండలం ఐ.పంగిడి గ్రామంలో జిల్లా పరిషత్‌కు చెందిన 7 ఎకరాల స్థలాన్ని గుర్తించి, అప్పట్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ కొవ్వూరు పట్టణంలో సేకరించిన చెత్తను వేయడానికి డంపింగ్ యార్డుకు కేటాయించారు. మున్సిపల్ సిబ్బంది పోలీసుల సహాయంతో చెత్తను వాహనాల్లో పంగిడి తరలిస్తుండగా పంగిడి గ్రామ ప్రజలు సుమారు 11 కిలోమీటర్లు దూరం నుంచి చెత్తను తీసుకువచ్చి పంగిడి గ్రామంలో వేయడానికి వీలులేదని రోడ్డెక్కి ధర్నాలు చేపట్టడంతో చెత్త సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. దీంతో పట్టణంలోని 23 వార్డుల్లో ఇంటింటా సేకరించిన చెత్త వేయడానికి స్థలం లేకపోవడంతో పవిత్ర గోదావరి తీరం గోష్పాద క్షేత్రానికి సమీపంలోని పాతరైలు వంతెన వద్ద రైల్వే బైపాస్‌లో కాటన్ విగ్రహం వద్ద మున్సిపల్ ఖాళీస్థలంలో పారవేస్తున్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఆ స్థలాన్ని పట్టణ పోలీస్‌స్టేషన్, సబ్‌జైలు నిర్మాణానికి రెవెన్యూ అధికారులు కేటాయించారు. మున్సిపల్ స్థలాలను ఒక్కొక్కటిగా ఇతర శాఖలకు బదలాయిస్తున్నారు. మున్సిపల్ డంపింగ్ యార్డుకు పంగిడిలో సేకరించిన స్థలాన్ని స్వాధీనం చేసుకుని వినియోగంలోకి తీసుకురాలేకపోతున్నారని అధికార, ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశాల్లో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పాతరైలు వంతెన వద్ద కాటన్ విగ్రహం నుంచి రైల్వేస్టేషన్ వరకు మినీబైపాస్‌కు ఇరుపక్కలా చెత్తను పారబోసి తగలబెడుతున్నారు. ఈ నేపథ్యంలో డంపింగ్ యార్డు సమస్య పురపాలక సంఘం ఏర్పడిన నాటి నుంచి కొవ్వూరును పట్టి పీడిస్తోంది. గత ఆరు దశాబ్దాలుగా ఈ సమస్య పరిష్కారానికి ఏ ఒక్కరూ పరిష్కారం చూపకపోవడంతో సమస్య తీవ్రరూపం దాల్చింది. ఇదే నియోజకవర్గం నుంచి ఇద్దరు మంత్రులుగా కూడా పనిచేశారు. ఒకరు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖామంత్రి కేఎస్ జవహర్ హయాంలో సమస్య ఎటూ తేలలేదు. ప్రస్తుత హోంమంత్రి తానేటి వనిత హయాంలో అయినా పరిష్కారం దొరుకుతుందని ఆశించిన పట్టణవాసులకు నిరాశే ఎదురయ్యింది. దీనికి తోడు మున్సిపల్ అధికారులు పట్టణానికి కొత్త సమస్యను తెచ్చిపెడుతున్నారు. ఎక్కడో మారుమూలన వేయవలసిన చెత్తను ప్రతిరోజు లక్షలాది మంది తిరిగే రాష్ట్ర రహదారి పక్కన పారవేస్తూ నిప్పుపెడుతున్నారు. దీంతో ఆ రహదారిలో పొగ వ్యాపించి వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. కొందరు అస్వస్థతకూ గురవుతున్నారు.

ఇదేం పాలనరా బాబూ...

ఆహ్లాదకరమైన అఖండ గోదావరి సోయగాలకు నెలవుగాను, ఆధ్యాత్మిక కేంద్రంగాను ఉన్న కొవ్వూరు పట్టణం ప్రస్తుతం ఈ చెత్త సమస్యతో అధ్వానంగా మారింది. ఎక్కడా చోటులేనట్టు గోదావరి చెంతనే చెత్తను డంప్ చేస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. స్థానికంగా ఉంటున్న అధికారులెవరికీ చెత్త సమస్య పట్టడంలేదు. ప్రతిరోజు తిరిగే ప్రజలు, వాహనదారులు మాత్రం దుర్వాసన భరించలేక, ఇదేం పాలనరా బాబూ అని చూసినవారంతా ముక్కున వేలేసుకుంటున్నారు. మరోవైపు చెత్తకు నిప్పు పెట్టడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు తగలబడి పొగ రహదారి అంతటా వ్యాపిస్తోంది. రహదారి కనిపించక వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. అంతేకాకుండా ఈ పొగ నుంచి విషవాయువాలు వ్యాప్తిచెంది ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. ఎంతో విలువైన స్థలంలో గత ప్రభుత్వం సుమారు 15 ప్రభుత్వ శాఖల కార్యాలయాల సముదాయం నిర్మాణం చేపట్టడానికి ప్రతిపాదించి చర్యలు చేపట్టింది. ఇంతలో ప్రభుత్వం మారడంతో ఆ స్థలాన్ని చెత్తవేసి డంపింగ్ యార్డుగా మార్చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత కాటన్ విగ్రహం వద్ద చెత్త డంపింగ్ చేస్తున్న స్థలంలో పట్టణ పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. మున్సిపాల్టీ ఆ స్థలంలో చెత్తను తొలగించడానికి సుమారు కోటి రూపాయలు వెచ్చించి హుటాహుటీన చెత్తను మండలంలోని దేచర్ల క్వారీ గోతులు, గోష్పాదక్షేత్రం, మున్సిపల్ వాటర్‌వర్క్సు స్థలాల్లో పారబోశారు. మున్సిపల్ స్థలాలను ఇతరశాఖకు బదలాయించడంలో అధికార పార్టీ నాయకులు, అధికారులు చూపిస్తున్న శ్రద్ధ దీర్ఘకాలంగా పట్టణాన్ని వేధిస్తున్న సమస్యల పరిష్కారంలో చూపడం లేదని ప్రతిపక్ష పార్టీ నాయకులు విమర్శిస్తున్నారు. ఖాళీచేసిన స్థలంలో ఇప్పటివరకు పోలీస్‌స్టేషన్ నిర్మాణం చేపట్టలేదు. చెత్త తొలగించిన గోతుల్లో వర్షపునీరు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా డంపింగ్ సమస్యకు పరిష్కారం చూపాల్సి ఉంది.



గోదావరి బాలోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్

ఉత్సాహంగా.. గోదావరి బాలోత్సవం

- అలరించిన శాస్త్రీయ, జానపదనృత్యాలు, కోలాటం
- నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి : జేసీ తేజ్‌భరత్ పిలుపు
- తల్లిదండ్రులు భాగస్వాములు కావాలి : ఎమ్మెల్సీ ఐవీ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 10: గోదావరి బాలోత్సవం.. ఉత్సాహంగా సాగింది. రాజమహేంద్రవరం, పరిసర మండలాల పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు శాస్త్రీయ, జానపదనృత్యాలు, కోలాటం వంటి కార్యక్రమాలతో అలరించారు. శనివారం రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో గోదావరి బాలోత్సవం పేరుతో 2వ పిల్లల పండుగ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బాలోత్సవంలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు నాందిపలకాలని అన్నారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు (ఐవీ) మాట్లాడుతూ పిల్లల ఆకాంక్షలకు అంక్షలు విధిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో జరుగుతున్న గోదావరి బాలోత్సవాలు విజయవంతం కావాలని అన్నారు. ఇటువంటి పిల్లల పండుగల్లో తల్లిదండ్రులు కూడా భాగస్వాములు కావాలని ఆయన కోరారు. కొత్తగూడెం చిల్డ్రన్ క్లబ్ అధ్యక్షుడు వాసిరెడ్డి రమేష్‌బాబు, గోదావరి బాలోత్సవం అధ్యక్షుడు నున్న తిరుమలరావు, అమరావతి బాలోత్సవం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, డీసీసీబీ ఛైర్మన్ ఆకుల వీర్రాజు, సీసీసీ ఛానల్ ఎండీ పంతం కొండలరావు, రాజమహేంద్రి మహిళా విద్యాసంస్థల కరస్పాండెంట్ టీకే విశ్వేశ్వరరెడ్డి, నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు, దేవరపల్లి బాలోత్సవం అధ్యక్షుడు డి.సత్యనారాయణ, డాక్టర్ చైతన్యశేఖర్, అల్లు బాబి, పి.బుచ్చిరామయ్య, యూటీఎఫ్ నాయకురాలు అరుణకుమారి, గోదావరి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి పీఎస్ఎన్ రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసి, బాలోత్సవం అసోసియేట్ అధ్యక్షులు వీఎస్ఎస్ కృష్ణకుమార్ సభకు అధ్యక్షత వహించారు. రెండు రోజులపాటు గోదావరి బాలోత్సవం నిర్వహిస్తుండగా, తొలిరోజున విద్యార్థినీ విద్యార్థులకు 18 అకడమిక్, 11 కల్చరల్ పోటీలు నిర్వహించారు. కాగా కల్చరల్ విభాగంలో శాస్త్రీయ, జానపద నృత్యాలు, కోలాటం, అభ్యుదయ గీతాలు, లఘు నాటిక, ఏకపాత్రాభినయం, రైమ్స్ తెలుగు ఇంగ్లీష్, అకడమిక్ విభాగంలో చిత్రలేఖనం, కథారచన, వ్యాసరచన, మెమొరీ టెస్ట్, కథా విశ్లేషణ, కవితలు తదితర పోటీలు నిర్వహించారు. కాగా రెండో శనివారం శనివారం, ఆదివారం కలసి రావడంతో గోదావరి బాలోత్సవం పేరుతో రాజమహేంద్రవరం, చుట్టుపక్కల మండలాల స్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు రెండు రోజులపాటు పిల్లల పండుగ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్న నిర్వాహకులకు జిల్లా విద్యాశాఖ నిర్ణయంతో విస్మయానికి గురయ్యారు. సీఎం జగన్ ఇటీవల ఏలూరు జిల్లా దెందులూరు పర్యటనకు వచ్చినపుడు జిల్లా విద్యాశాఖాధికారులు స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. స్కూలు బస్సులన్నింటినీ సీఎం సభకు తరలించారు. ఆ సెలవు కవర్ చేయడానికి రెండో శనివారం స్కూళ్లు తెరవడంతో బాలోత్సవంపై ఆ ప్రభావం పడుతుందని భావించారు. కానీ పిల్లలు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఊపిరిపీల్చుకున్నారు.





రాజమహేంద్రవరంలో జరిగిన గోదావరి బాలోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు.. విద్యార్థిని నృత్య ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాష్ట్రాన్ని జగన్ రూ.8 లక్షల కోట్లు అప్పులు పాలు చేశాడు : గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 10: జగన్ పాలనలో ఈ రాష్ట్రం రూ.8 లక్షల కోట్లు అప్పులపాలైందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో రాష్ట్రంలో 39,450 పరిశ్రమలు వచ్చాయని, ఉద్యోగాలు కూడా 5 లక్షల 13 వేల 351 మందికి వచ్చాయని గుర్తుచేశారు. ప్రస్తుత పాలనలో జగన్ పరిశ్రమలు తీసుకురాకపోగా ఉద్యోగాలు కేవలం 9,158 ఇచ్చారన్నారు. ఆర్థికశాఖ మంత్రి బుగ్గన ఢిల్లీ చుట్టూ తిరగడం తప్ప ఏమీ చేయలేకపోయారని, రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసి అప్పుల అప్పారావుగా మారాడని ఎద్దేవా చేశారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలు చూస్తేనే వైసీపీ పని అయిపోయిందని స్పష్టమైందన్నారు. కోరంలేక సమావేశం గంట వ్యవధిలో ఆగిన విషయాన్ని గుర్తుచేశారు. స్పీకర్ తమ్మినేని వ్యాఖ్యలను గోరంట్ల తప్పుపట్టారు. ఆయన ఎంత దారుణంగా ఏకపక్షంగా వ్యవహరించారో అందరికీ తెలుసునన్నారు. ఇక జగన్ రాష్ట్రంలో వ్యవస్థలన్నీ సర్వనాశనం చేశాడని మండిపడ్డారు. టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వచ్చాక వైసీపీ ప్రభుత్వ అవినీతిపై విచారణ జరిపిస్తామని శిక్షపడేలా చేస్తామన్నారు. రాజమహేంద్రవరం రూరల్‌లో ఐదో కృష్ణుడుగా వచ్చిన మంత్రి మీటింగ్‌లు పెట్టి పంచాయతీ సెక్రటరీలతో రూ.లక్షలు ఖర్చులు పెట్టిస్తున్నారంటూ గోరంట్ల మండిపడ్డారు.

ఎన్నికల నిర్వహణకు నిర్దిష్టమైన చర్యలు : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 10: ఎన్నికల నిర్వహణకు నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. ఎన్నికల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లు, ఎన్నికల సిబ్బంది గుర్తింపు, డేటా నమోదు, తుది ఓటరు జాబితా, ఫారం 6,7,8 ప్రస్తుత పురోగతి తదితర అంశాలపై శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేపట్టిన చర్యలను వివరించారు. జిల్లాలో 395 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్టు చెప్పారు. ఎన్నికల విధులపై సిబ్బందితో పలు దఫాలుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈనెల 15 నాటికి ఆర్వో లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులు పూర్తిచేస్తామని, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌లకు అనువైన భవనాలు గుర్తించామన్నారు. లక్షా 78వేల ఎపిక్ కార్డులు ప్రింటింగ్‌కు పంపడం జరిగిందని కొత్తగా 46,761 ఎపిక్ కార్డుల ప్రింటింగ్‌కి డేటా పంపామన్నారు. ఈ సమావేశంలో రూరల్ ఆర్వో, జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్, అర్బన్ ఆర్వో కమిషనర్ దినేష్‌కుమార్, కొవ్వూరు ఆర్వో సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, డీఆర్వో జి.నరసింహులు, రాజానగరం ఆర్‌వో చైత్రవర్షిణి, అనపర్తి ఆర్‌వో ఎం.మాధురి, గోపాలపురం ఆర్వో శివజ్యోతి పాల్గొన్నారు.

ఆ 'మూడూ'.. చిక్కుముడులే

- వైసీపీలో టెన్షన్ టెన్షన్
- అయోమయంలో అనపర్తి
- గరంగరంగా రాజానగరం
- పలుకులేని నిడదవోలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో నాలుగు స్థానాలకు ఇప్పటికే వైసీపీ ఇంచార్జిలను ప్రకటించింది. దీంతో ఆయా ఇన్చార్జులు నియోజకవర్గాన్ని ఆకట్టుకునే పనిలోపడ్డారు. మిగిలిన మూడు అసెంబ్లీ స్థానాల్లో మాత్రం ప్రతిష్ఠంభన వీడడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ రాజకీయ బదిలీలకు తెరతీసిన విషయం తెలిసిందే. జిల్లాకొచ్చేసరికి రాజమహేంద్రవరం సిటీ, రూరల్, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాలకు ఇప్పటికే ఆ పార్టీ ఇన్చార్జిలను ప్రకటించింది. కానీ అనపర్తి, రాజానగరం, నిడదవోలు నియోజకవర్గాల్లో మాత్రం ముందడుగు పడడం లేదు. దీంతో ప్రస్తుత సిట్టింగుల భవితవ్యంపై బెట్టింగులూ మొదలయ్యాయి. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఈ మూడు నియోజకవర్గాల బాధ్యులు తమ భవిష్యత్తుపై తీవ్రమైన డైలమాను అనుభవిస్తుంటే, వీరి కేడర్ల పరిస్థితి గందరగోళంగా మారింది. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2008లో రాజానగరం నియోజకవర్గం ఊపిరి పోసుకోగా, రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాలు ఈ నియోజకవర్గం పరిధిలోకి వస్తాయి. 2009, 2014లో రెండుసార్లు ఇక్కడ టీడీపీ విజయకేతనం ఎగురవేసింది. 2019లో ఫ్యాన్ గాలిసురులో వైసీపీకి ఆ సీటు దక్కింది. ఇప్పుడు ఆ నియోజకవర్గానికి వైసీపీ ఇన్చార్జిని ఇంకా ప్రకటించకపోవడం చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గ ఎమ్మెల్యే, తూర్పుగోదావరి వైసీపీ అధ్యక్షుడు జక్కంపూడి రాజా రాజానగరం నియోజకవర్గ వ్యవహారాలు చూస్తున్నారు. ఇప్పుడు ఆయనే మళ్లీ ఆ స్థానంలో ఉంటారా? ఖాళీ చేస్తారా? అనే ప్రస్తావన నలుగుతోంది. జక్కంపూడి రాజా సోదరుడు జక్కంపూడి గణేశ్ పేరు వినిపిస్తున్నా చాలామంది దానిని కొట్టిపారేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో వైసీపీకి సంబంధించి ఇప్పటికే పలువురు సీనియర్ నాయకులు పార్టీకి దూరమయ్యారు. దీంతో అక్కడ అభ్యర్థి ప్రకటన అగమ్య గోచరంగా మారింది. మరోపక్క జనసేన అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటున్న పార్టీ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ ప్రచారంలో వేగం పెంచారు. ఇదిలా ఉండగా రాజానగరం అభ్యర్థిని ప్రకటించకుండా వైసీపీ అధిష్ఠానం సందిగ్ధంలో పెట్టడానికి తెరవెనుక బలమైన కారణం ఉందనే ప్రచారం జనాల నోళ్లలో నానుతోంది. జనసేన నుంచి అగ్రనేత ఈ నియోజకవర్గం బరిలో దిగే అవకాశం ఉందనే ఊహలు చక్కెర్లు కొడుతున్నాయి. ఆ కారణంతోనే సమవుజ్జీని వెతికే పనిలో వైసీపీ పెద్దలు ఉన్నారని చెబుతున్నారు. అసలే అభ్యర్థులు కరువైన సమయంలో కీలకమైన స్థానానికి ఎవరిని ప్రకటించాలా అని తలపట్టుకుంటున్నారట. ఆ పరిస్థితి ఎదురైతే జక్కంపూడి కుటుంబానికి సీటు ఎక్కడ దక్కుతుందో వేచి చూడాల్సిందే. ఇక నిడదవోలు నియోజకవర్గం ఏర్పడిన తర్వాత రెండుసార్లు టీడీపీ నెగ్గింది. 2019లో ఫ్యానుగాలిలో గెడ్డం శ్రీనివాసనాయుడు (జి.శ్రీనివాసనాయుడు) గెలుపు దక్కించుకున్నారు. ఆయన తండ్రి గతంలో కొవ్వూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. అప్పట్లో శ్రీనివాసనాయుడు తండ్రి అంతా తానై నడిపించేవారు. ఇప్పుడు నియోజకవర్గంలోని నాయకులతో సమన్వయం దెబ్బతినడంతో కొందరు నేతల్లో అసంతృప్తి పెరిగింది. చివరికి పార్టీలోని ఆయన సామాజిక వర్గం కూడా ఆయనను మరొకసారి ఒప్పుకునే పరిస్థితి లేదని అంటున్నారు. ఆయన తీరుపై సొంత కేడర్‌లోని ద్వితీయ శ్రేణి నాయకులు ఆగ్రహం వ్యక్తంచేస్తుండగా.. పార్టీలో స్థానిక బీసీ వర్గం రాజమహేంద్రవరం వచ్చి భరత్ వర్గంలో చేరారనే ప్రచారం సాగుతోంది. స్థానికంగా ఎమ్మెల్యేను వీడి ఎంపీ భరత్‌తో సంబంధాలు కొనసాగిస్తున్నారని సమాచారం. పార్టీ పెద్దలు చేయించిన అంతర్గత సర్వేలో కూడా ఎమ్మెల్యేపై వ్యతిరేకత వ్యక్తమైందని, దీంతో ప్రత్యామ్నాయం వైపు కూడా పార్టీ ఆలోచిస్తోందని ప్రచారం జరుగుతోంది. దాంతో ఇన్చార్జి విషయంలో నిడదవోలు ప్రస్తుతానికి ఉలుకూపలుకూ లేకుండా ఉందనే ఊహాగానాలు జోరుగా వినవస్తున్నాయి. ఇక అనపర్తి నియోజకవర్గం నాలుగుసార్లు టీడీపీకి పట్టం కట్టింది. గత ఎన్నికల్లో ఫ్యాను గాలిలో వైసీపీ నెగ్గేసింది. ఎమ్మెల్యేగా డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తొలిసారి శాసనసభలో అడుగుపెట్టారు. అయితే నియోజకవర్గంలోని అక్రమాలను టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎప్పటికప్పుడు ఏకరువు పెడుతూనే ఉన్నారు. 2020 డిసెంబరు 23న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి సత్య ప్రమాణం చేసినా ఆయన తీరు మాత్రం ఇప్పటివరకూ మారలేదనే విమర్శలున్నాయి. అక్రమ గ్రావెల్, మైనింగ్, భూదందా, పేదలకు ప్రభుత్వం ఇచ్చే గృహాలకు నివాస యోగ్యంకాని భూములను అధిక ధరలకు కొనుగోలుతో అక్రమంగా లాభపడడం, పేకాట క్లబ్బుల్లో వాటాలు తదితర వక్ర మార్గాల్లో ఇక్కడి అధికార పార్టీ నేతలు ప్రజలను దోచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ప్రతిపక్షాలపై బురదజల్లడమే తప్ప తాను చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పలేని పరిస్థితి ఉందని సొంత పార్టీలోనే చర్చ నడుస్తోంది. పది రూపాయల డాక్టర్‌గా సూర్యనారాయణ రెడ్డికి మంచి పేరుంది. కానీ ఇటీవల రంగంపేట మండలం మల్లిపూడిలో ఒక మెడికల్ డిస్పోజబుల్ ఫ్యాక్టరీకి అనుమతులివ్వడంలో ఆయన ప్రమేయం ఉందంటూ స్థానికంగా పెద్ద వివాదం రేగింది. ఇదిలా ఉంటే కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండడంతో వైసీపీ పెద్దలు ఆయనను అనపర్తి నియోజకవర్గం నుంచి బరిలో దింపే ఆలోచన చేస్తున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది.

రద్దుచేసిన రైళ్లను పునరుద్ధరించాలి

- కోవిడ్ సమయంలో కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో 24 రైళ్ల హాల్ట్‌లు రద్దు
- వాటిని తిరిగి నిలుపుదల చేయాలని రైల్వే పరిరక్షణ సమితి డిమాండ్
- కొవ్వూరు నుంచి కలెక్టరేట్ వరకు సమితి సభ్యుల పాదయాత్ర

కొవ్వూరు, ఫిబ్రవరి10: కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో కోవిడ్ కారణంగా రద్దుచేసిన 24 రైళ్లకు తిరిగి హాల్ట్ కల్పించాలని రైల్వే పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. శనివారం 'మన ఊరు-మన సౌకర్యాలు' అంటూ కొవ్వూరు రైల్వేస్టేషన్ నుంచి రోడ్డు కం రైలు బ్రిడ్జి మీదుగా కోటిపల్లి బస్టాండ్, రాజమహేంద్రవరం బస్టాండ్ మీదుగా ఎంపీ భరత్ కార్యాలయం చేరుకుని కార్యాలయ ఇన్‌చార్జికి, అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ 2019 సంవత్సరానికి ముందు కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో 36 రైళ్ల హాల్ట్ ఉండగా 24 రైళ్ల హాల్ట్‌లను ఏకపక్షంగా రద్దు చేయడంతో సామాన్యులు రైలు ప్రయాణ సౌకర్యానికి దూరమయ్యారన్నారు. దీనికితోడు కలెక్టర్ ఆదేశాలతో కొవ్వూరు రోడ్డుకం రైలు బ్రిడ్జిపై ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, లగ్జరీ, సూపర్ లగ్జరీ, ఓల్వో బస్సులను రద్దు చేయడంతో ప్రయాణాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో గతంలో నిలుపుదల చేసే 24 రైళ్లను తిరిగి హాల్ట్ కల్పించాలని, అదేవిధంగా ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, లగ్జరీ, సూపర్‌లగ్జరీ, ఓల్వో బస్సులను కొవ్వూరు బస్టాండుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు, స్థానికులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లలమర్రి మురళీకృష్ణ, కెవికె రంగారావు, చిలంకుర్తి బాబి, పిక్కి నాగేంద్ర, చెరుకూరి సాయిరాజు, కొండపల్లి రత్నసాయి, పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

'16న రవాణా రంగం బంద్'



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కొవ్వూరు, ఫిబ్రవరి 10: ఈ నెల 16న రవాణా రంగం బంద్ చేపట్టినట్టు ఐఎఫ్‌టీయూ నాయకులు పి.నాగేశ్వరరావు, సీహెచ్ రమేష్ తెలిపారు. శనివారం కొవ్వూరు మండలం పంగిడి గ్రామంలో లారీ డ్రైవర్లతో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఐపీసీ 304 ప్రకారం రోడ్డు ప్రమాదం జరిగితే రెండేళ్ల జైలు శిక్ష విధించేవారని, కొత్త చట్టం ప్రకారం ఐదేళ్లకు పెంచారన్నారు. రూ.7లక్షల జరిమానా విధిస్తారన్నారు. ఈ చట్టాన్ని నిరసిస్తూ ఈ నెల 16న రవాణా రంగం బంద్ చేయాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయన్నారు.

కొవ్వూరులో జనసేనాని పర్యటన ఏర్పాట్లు



నందమూరు రోడ్‌లో లేఅవుట్‌లను పరిశీలిస్తున్న జనసేన నాయకులు

కొవ్వూరు, ఫిబ్రవరి 10: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొవ్వూరులో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పర్యటనకు సంబంధించి సభా ప్రాంగణం, హెలీప్యాడ్ ప్రాంతాలను శనివారం జనసేన నాయకులు పరిశీలించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు ఆధ్వర్యంలో నందమూరు రోడ్‌లో సభావేదిక, హెలీప్యాడ్‌కు అనువైన లేఅవుట్లను పరిశీలించారు. కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా ప్రోగాం కమిటీ మెంబర్ మాణికి రెడ్డి తేజస్, డేగల రాము, గంగుమళ్ల స్వామి, కె.రామాంజనేయులు పాల్గొన్నారు.

పంగిడిలో 'పల్లెకు పోదాం'

కొవ్వూరు, ఫిబ్రవరి 10: రానున్న ఎన్నికల్లో బీజేపీకి మద్దతిచ్చి నరేంద్రమోదీని మరోసారి ప్రధానిని చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధ అన్నారు. కొవ్వూరు మండలం పంగిడిలో శనివారం పల్లెకు పోదాం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రచారం చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ప్రభాస్ యోజన కన్వీనర్ బూసి బెనర్జి, మండలాధ్యక్షుడు పెరుగు పోతురాజు, మణికంట తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక.. కొవ్వూరు జనసేన నాయకుడు గండ్రోతు పవన్ సోమరాజు బీజేపీలో చేరారు. కొవ్వూరు అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు సమక్షంలో రాజమహేంద్రవరంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో రేలంగి శ్రీదేవి, ప్రభుజీ, పిల్లలమర్రి మురళీకృష్ణ, పిక్కి నాగేంద్ర, గోపిశెట్టి శివకృష్ణ, పెరుగు పోతురాజు పాల్గొన్నారు.

'రక్షణ' లేని వంతెన

కాకరపర్రులో ప్రమాదాల బారిన వాహనదారులు



కాకరపర్రులో వంతెనకు ఉన్న రక్షణ గోడలు ధ్వంసమైన దృశ్యం

పెరవలి, ఫిబ్రవరి 10: కాకరపర్రు నుంచి పంట భూములకు వెళ్లాలంటే ఈ వంతెన ప్రధాన ఆధారం. అధిక సంఖ్యలో రైతులు ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తుంటారు. పంట భూములకు ఎరువులు తీసుకెళ్లడంతో పాటు ఉత్పత్తులను బయటకు తీసుకొచ్చేందుకు ఈ వంతెన ప్రధాన ఆధారం. ఏటిగట్టు నుంచి వంతెనపైకి దిగే ప్రదేశంలో ప్రమాదకరంగా ఉండడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. అనేక సార్లు ప్రమాదాల బారిన కూడా పడ్డారు. ఇరువైపులా రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని అంటున్నారు.

50 ఏళ్లకే పెన్షన్ సౌకర్యం కల్పించాలి

ఊనగట్ల సమావేశంలో నాయీ బ్రాహ్మణసేవా సమితి

చాగల్లు, ఫిబ్రవరి 10: కులవృత్తి చేసుకుని జీవనం సాగిస్తున్న నాయీ బ్రాహ్మణులకు 50 ఏళ్లకే పెన్షన్ సౌకర్యం కల్పించాలని నాయీ బ్రాహ్మణసేవా సమితి సభ్యులు కోరారు. ఊనగట్లలో శుక్రవారం జరిగిన సమావేశంలో కులవృత్తి చేయడం వల్ల కంటి చూపు మందగించి వృత్తికి దూరమవుతున్నారని సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాలకు సంబంధించి నూతన కార్యవర్గాలను ధూపాటి శ్రీనివాస్ ప్రకటించి సభ్యులతో ప్రమాణం చేయించారు. మూడు నియోజకవర్గాలకు ఉమ్మడి అధ్యక్షుడిగా ధూపాటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా తణుకు సూరి బాబు ప్రమాణస్వీకారం చేశారు. కాగా కొవ్వూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా తుమ్మలపల్లి వెంకట నారాయణ, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి సత్యన్నారాయణ, నిడదవోలు నియోజకవర్గ అధ్యక్షుడిగా కొండేపాటి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా తాడిమల్ల వెంకటేశ్వరరావు, గోపాలపురం నియోజకవర్గ అధ్యక్షుడిగా అరిగెల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా కె.సత్యనారాయణలను ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి వీరభద్రరావు దరఖాస్తు



నిడదవోలు, ఫిబ్రవరి 10: నిడదవోలు నియోజకవర్గం నుంచి 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తన దరఖాస్తును పరిశీలించాలని తణుకుకు చెందిన పూలమాల వీరభద్రరావు విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో దరఖాస్తు అందించినట్టు శనివారం నిడదవోలులో విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. నిడదవోలు పురపాలక సంఘంలో సుదీర్ఘకాలం ప్రభుత్వ ఉద్యోగిగా సేవలందించి 2021లో రిటైర్ అయ్యానన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ద్వారా నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాలనుకుంటున్నానని ఆయన చెప్పారు.

నేడు టీడీపీ కార్యాలయం ప్రారంభం

గోపాలపురం, ఫిబ్రవరి 10: గోపాలపురంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభిస్తున్నట్టు మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో కార్యాలయాన్ని ప్రారంభించి జెండా ఆవిష్కరణ అనంతరం భారీ ర్యాలీ నిర్వహిస్తారని, ఈ సందర్భంగా పలు పార్టీల నుంచి చేరికలు ఉంటాయన్నారు.

చాగల్లులో వివాహిత అనుమానాస్పద మృతి





చెట్టుకు ఉరివేసుకుని ఉన్న దుర్గాభవాని, ఫైల్‌ఫొటో

చాగల్లు, ఫిబ్రవరి 10: చాగల్లు శివారు జగనన్న కాలనీకి సమీపంలో మహిళ చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మీనానగరానికి చెందిన దుర్గాభవాని(25)కి అదే గ్రామానికి చెందిన జాన శివరామకృష్ణతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వారికి మూడేళ్ల అమ్మాయి, రెండేళ్ల అబ్బాయి ఉన్నారు. భార్యాభర్తల గొడవలు రావడంతో కొన్నాళ్లుగా వేర్వేరుగా ఉంటున్నారు. దుర్గాభవాని పుట్టింటి వద్దనే పిల్లలతో ఉంటోంది. మూడు రోజులుగా కనిపించడం లేదని ఆమె కోసం వెతుకుతున్నారు. శనివారం జీడి మామిడి తోటలో చెట్టుకు వేలాడుతుండడం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ పి.నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కాటన్ బ్యారేజ్‌పై 15 వరకు రాకపోకలు నిలిపివేత

ధవళేశ్వరం, ఫిబ్రవరి 10: కాటన్ బ్యారేజ్‌పై రహదారి మరమ్మతుల నేపథ్యంలో మరో ఐదు రోజులు రాకపోకలు నిలిపివేస్తున్నట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఈ నెల 10 నాటికి పనులు పూర్తి చేసి రాకపోకలు పునరుద్ధరిస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపినా పనులు పూర్తికాకపోవడం, కాంక్రీట్ క్యూరింగ్ వంటి పనులు ఉండడంతో మరో 5రోజులు ట్రాఫిక్‌ను మళ్లించాలని ఇరిగేషన్ అధికారులు కోరారు. ఈ పనుల దృష్ట్యా ఈనెల 15 వరకు బ్యారేజ్‌పై రాకపోకలు నిలిపివేస్తున్నట్టు ఒక ప్రకటనలో తెలుపుతూ ప్రజలు సహకరించాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం

- నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా
- లారీల నుంచి రోడ్లపైకి జారుతున్న వైనం
- శుభ్రం చేయని మునిసిపల్ సిబ్బంది
- ప్రమాదాల బారిన వాహనదారులు



కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద రోడ్డుపై ఉన్న ఇసుక

కొవ్వూరు, ఫిబ్రవరి 10: ఇసుకాసురులకు వాహనదారులు బలైపోతున్నారు. ఇసుక తవ్వకాలు, రవాణాలో నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. కొవ్వూరు పట్టణ, మండల పరిధిలోని ఇసుకర్యాంపుల్లో గోదావరి వంతెనల చెంతనే అక్రమంగా డ్రెడ్జింగ్ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. లారీల్లో నిబంధనలకు విరుద్ధంగా అధికంగా టన్నుల కొద్దీ ఇసుక రవాణా చేస్తున్నారు. కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి నుంచి గోదావరి మాత విగ్రహం వరకు ప్రతిరోజు లారీల్లో ఇసుక జారిపడి రోడ్డుపై పడుతోంది. రోడ్డుపై పడిన ఇసుకను శుభ్రం చేయవలసిన మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై అధికార పార్టీకి చెందిన 5వ వార్డు కౌన్సిలర్ మద్దిపట్ల సాయిగీత జనవరి నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమావేశం జరిగి 15 రోజులు కావస్తున్న మున్సిపల్ అధికారులు గాని, పాలకవర్గ సభ్యులు గాని స్పందించలేదు. కౌన్సిల్ సమావేశం జీరో అవర్‌లో కౌన్సిల్ సభ్యులు పట్టణంలోని ప్రజా సమస్యలపై ప్రస్తావించిన ఏ అంశంపైనా అధికారులు శ్రద్ధ చూపడం లేదని అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు నిలదీశారు. అందుకు లారీల నంచి రోడ్లపై పడిన ఇసుకను శుభ్రం చేయకపోవడమే నిదర్శనం. ఇకనైనా మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్, పాలకవర్గ సభ్యులు స్పందించి రోడ్డు కం రైలు బ్రిడ్జి నుంచి గోదావరి మాత విగ్రహం వరకు గోదావరి ఏటిగట్టు రోడ్డుపై పడిన ఇసుకను పూర్తిగా తొలగించి, వాహనదారులను ప్రమాదాల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

మోదీపై అనుచిత వ్యాఖ్యలకు బీజేపీ నిరసన

రాజమహేంద్రవరంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం



రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 10: ప్రధాని నరేంద్రమోదీ బీసీ కాదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసిస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శనివారం రాజమహేంద్రవరం కంబాలచెరువు సెంటర్లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యసాయిరాం మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని కాంగ్రెస్ పార్టీ ఓర్వలేకపోతోందని విమర్శించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురగంటి సతీష్ మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల రామకృష్ణారావు, పడాల నాగరాజు, కందికొండ రమేష్, మన్నెం శ్రీనివాస్, పిల్లాడి రుద్రయ్య, వీరా వీరాంజనేయులు, డాక్టర్ అనురాధ పాల్గొన్నారు.

'తోట' తీరుతో వైసీపీకి పలువురి రాజీనామా

టీడీపీలో చేరుతున్నట్టు ప్రకటన

గోకవరం, ఫిబ్రవరి 10: వైసీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం వ్యవహారశైలి నచ్చక పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు మండలంలోని రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు తెలిపారు. ఈ మేరకు శనివారం గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నరుకుల నాగబాబు, కసిరెడ్డి రవిబాబు, నరుకుల రాజబాబు, కసిరెడ్డి సతీష్ తదితరులు మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన నరసింహం నాయకులకు, కార్యకర్తలకు సమాచారం ఇవ్వకుండానే పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, నాయకులు, కార్యకర్తలు మనోభావాలు దెబ్బతినేలా వ్యవహస్తున్నారంటూ మండిపడ్డారు. సుమారు 100 మంది కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సమక్షంలో త్వరలో టీడీపీలోకి చేరుతున్నామని వారు ప్రకటించారు.

జగన్‌రెడ్డి అరాచకాలపై నారా లోకేశ్ శంఖారావం

- మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు



నిడదవోలు సమావేశంలో మాట్లాడుతున్న బూరుగుపల్లి శేషారావు

నిడదవోలు, ఫిబ్రవరి 10: సీఎం జగన్, వైసీపీ నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పూరించిన నాదమే శంఖారావమని టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. నిడదవోలులోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై లోకేశ్ రాష్ట్ర వ్యాప్తంగా శంఖారావం కార్యక్రమం చేపట్టనున్నారన్నారు. ఒక్కోరోజు మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని, దీని ద్వారా ఇటు ప్రజలతోను, అటు పార్టీ కార్యకర్తలతోను మమేకమవుతారని చెప్పారు. కార్యక్రమంలో కొమ్మిన వెంకటేశ్వరరావు, తిరుపతి సత్యనారాయణ పాల్గొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరులో జరిగిన పాత్రికేయుల సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి మాట్లాడారు. 120 నియోజకవర్గాల్లో 40 నుంచి 50 రోజులపాటు శంఖారావం ద్వారా లోకేష్ పర్యటన సాగుతుందని, దీని ద్వారా నేరుగా పార్టీ నాయకులతో మమేకమవుతారన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు దాయన రామకృష్ణ, మాదిరెడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు



నల్లజర్లలో మాట్లాడుతున్న మద్దిపాటి

నల్లజర్ల: నల్లజర్ల టీడీపీ కార్యాలయంలో స్థానిక నాయకులతో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావంతో పర్యటించి జగన్‌రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలను ప్రజలకు కార్యకర్తలకు తెలియజేస్తారన్నారు. కార్యక్రమంలో జమ్ముల సతీష్, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు దళిత సింహగర్జన సభ

- వేమగిరిలో భారీగా ఏర్పాట్లు
- పరిశీలించిన మాజీ ఎంపీ హర్షకుమార్



సభా నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 10: సుమారు 15 ఏళ్ల క్రితం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో లక్షలాది మందితో మాలల సింహగర్జన సభ నిర్వహించిన అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ దళిత వర్గాలకు జగన్ పాలనలో జరిగిన అన్యాయాన్ని వెలుగెత్తి చాటేందుకు ఈ నెల 11న రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో దళిత సింహగర్జన సభ నిర్వహిస్తున్నారు. ఇందుకు భారీ ఏర్పాట్లు చేశారు. భారీ వేదిక, గ్యాలరీలు, సుమారు 30 వేల మంది కూర్చొనే విధంగా సభా ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. జాతీయ రహదారి సమీపంలో వాహనాల పార్కింగ్‌కు కేటాయించారు. ఏర్పాట్లను శనివారం హర్షకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ ఆపై దళితుల గొంతుక నొక్కాడని, 27 దళిత సంక్షేమ పథకాలను రద్దు చేశారని విమర్శించారు. సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారని, మెడికల్ కళాశాలలో దళితులకు కేటాయించిన సీట్లను సైతం అమ్మేసుకున్నారని ధ్వజమెత్తారు. దళిత సింహగర్జన సభకు దళితులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గడ్డం సురేష్, శెట్టి రాజా, సైరా బాను, ఎల్‌వి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ సహకారంతో ఆలయాల అభివృద్ధికి చర్యలు

పలు ఆలయ కమిటీలకు చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కోరుకొండ, ఫిబ్రవరి 10: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు ద్వారా రాజానగరం నియోజకవర్గంలోని 115 దేవాలయాల అభివృద్ధికి రూ.11.5కోట్లు మంజూరైనట్టు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పేర్కొన్నారు. దీనిలో భాగంగా శనివారం రూ.45.44 లక్షల చెక్కలను పలు గ్రామాల్లోని ఆలయ కమిటీ సభ్యులకు ఆయన అందజేశారు. మండలంలోని జంబుపట్నంలో నిర్మిస్తున్న శివాలయానికి రూ.8 లక్షలు, కూనవరంలో శ్రీకృష్ణ ఆలయ కమిటీకి రూ.6.72 లక్షలు, నామవరంలో శ్రీకృష్ణ ఆలయానికి రూ.6.72 లక్షలు, కొత్తతుంగపాడులో విఘ్నేశ్వరాలయానికి రూ.8 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వుల్లి అప్పన్నదొర, నాగా సత్యనారాయణ, ఎంపీపీ వుల్లి సూర్యకుమారి, వుల్లి పట్టాభిరామయ్య, వుల్లి చల్లారావు, నాగా రమేష్, వుల్లి గణనాథరావు, తోరాటి సత్యప్రసాద్, చిట్నీడి వెంకటేశ్వరరావు, నాగ శేషగిరి పాల్గొన్నారు.


జనసేన కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సువర్ణరాజు

గోపాలపురం, ఫిబ్రవరి 10: జనసేన పార్టీ కోసం శ్రమించి పని చేసిన ప్రతీ కార్యకర్త కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు కోలా శ్రీనివాసరావు భార్య ఆదిలక్ష్మికి రూ.10వేలు నగదు శనివారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు గణపతి, రామలీలాధర్, శాంతి, నరేంద్ర, సీతారామ్, మణికంఠ, సీతామహాలక్ష్మి, పోసమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం ఆర్వోగా శివజ్యోతి



గోపాలపురం, ఫిబ్రవరి 10: గోపాలపురం నియోజకవర్గ ఆర్వోగా కేఎల్ శివజ్యోతి శనివారం నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ కే.మాధవిలతను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల నిర్వహణకు నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించినట్టు తెలిపారు. ఇప్పటివరకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన తనను బదిలీపై జిల్లాకు పంపించారన్నారు. ఇప్పటివరకు ఇక్కడ ఈఆర్వోగా బాధ్యతలు నిర్వహించిన ఎం.వెంకటసుధాకర్ ఓఎన్‌జీసీ ఎస్‌డీసీగా బాధ్యతలు చేపట్టినట్టు తెలిపారు.

కొవ్వూరు పట్టణ ఎస్‌ఐగా జగన్మోహనరావు



కొవ్వూరు, ఫిబ్రవరి 10: కొవ్వూరు పట్టణ ఎస్‌ఐగా కె.జగన్మోహనరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన మురళీకృష్ణ సీఐగా పదోన్నతిపై వెళ్లారు. దీంతో బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న జగన్మోహనరావు బదిలీపై వచ్చారు.

రిటైర్డ్ ఉద్యోగులకు డీఏ బకాయిలు చెల్లించాలి

నల్లజర్ల, ఫిబ్రవరి 10: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు కరువు భత్యం బకాయిలు చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ మండలాధ్యక్షుడు యస్‌ఎం ఆలీ సాహెబ్ డిమాండ్ చేశారు. శనివారం నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన రిటైర్డ్ ఎంప్లాయిస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెన్షన్‌దారులకు పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని, 12పీఆర్‌సీ, ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సభ్యులందరికి జీవనప్రమాణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఐడీ సత్యం, ఐడీపీ అప్పారావు, బాలయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 10: విద్యార్థుల అభివృద్ధికి ట్యాబ్‌లు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు అన్నారు. శనివారం మండలంలోని చివటం, వేలివెన్ను హైస్కూల్స్ విద్యార్థులకు ఆయన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రుల తమ పిల్లలకు మంచి విద్యనందించేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, ఎంఈవో సత్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

భూమి అమ్ముతామని డబ్బు తీసుకుని మోసం

అన్నదేవరపేటకు చెందిన నలుగురిపై కేసు

కొవ్వూరు, ఫిబ్రవరి 10: భూమి అమ్ముతామని డబ్బు తీసుకుని మోసం చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. కొవ్వూరుకు చెందిన గర్నిపూడి శ్రీదేవికి తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన మేన్ని చంద్రమోహన్, నాగభువన తమ అర ఎకరం భూమి విక్రయిస్తామని నమ్మించి 2017 నవంబరు 8వ తేదీన రూ.4.70 లక్షలు తీసుకుని భూమి రిజిస్ట్రేషన్ చేయలేదు. దీనిపై పెద్దల్లో పెట్టినా, స్పందనలో ఫిర్యాదుచేసిన భూమి రిజిస్ట్రేషన్ చేయలేదు. వాటన్నిటిని దృష్టిలో పెట్టుకుని చంద్రమోహన్, నాగభువన, వారి కుమారులు నాగార్జున, మహేష్‌లు శ్రీదేవి ఇంటికి వచ్చి భూమి అగ్రిమెంటు కాగితాలు ఇవ్వాలని, లేకుంటే చంపుతామని బెదిరించడంతో శ్రీదేవి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నలుగురిపై కేసునమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

గుండెపోటుతో లక్ష్మీపురం వీఆర్వో మృతి



దేవరపల్లి, ఫిబ్రవరి 10: దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామానికి చెందిన మందపాటి వెంకట్రావు (50) శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. వెంకట్రావు వీఆర్వోగా మండలంలోని లక్ష్మీపురం వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నారు. కాగా ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు.

కోడి పందాలు ఆడుతున్న 16 మంది అరెస్టు

రెండు కోళ్లు, రూ.7150 నగదు, ఏడు బైక్‌లు, స్వాధీనం

చాగల్లు, ఫిబ్రవరి 10: మండలంలోని చిక్కాల పామాయిల్ తోటలో కోడి పందాలు ఆడుతున్న 16 మందిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ పి.నాగరాజు తెలిపారు. శుక్రవారం రాత్రి సిబ్బందితో కలిసి దాడి చేసి కోడి పందాలు ఆడుతున్న వారిని అరెస్టు చేసి వారి నుంచి రెండు కోళ్లు, రూ.7150 నగదు, ఏడు మోటారు సైకిళ్లు, స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

తాళ్లపూడిలో ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణం



తాళ్లపూడిలో రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

తాళ్లపూడి, ఫిబ్రవరి 10: మండలంలో ఎట్టకేలకు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు రోడ్ల నిర్మాణం చేపట్టారు. గుంతలు పడిన రోడ్లకు సుమారు రూ.4 కోట్లతో మోక్షం కలుగుతోంది. సుమారు నాలుగున్నరేళ్లు నానా కష్టాలు అనుభవించామని, ప్రస్తుత పనులతో కాస్తయినా ఉపశమనం పొందినట్లైందని స్థానికులు అంటున్నారు. ఇదిలా ఉండగా మండల కేంద్రం తాళ్లపూడిలో రోడ్ల ఆక్రమణలు తొలగిస్తారని, ట్రాఫిక్ ఇబ్బందులు తొలుగుతాయని ఆశ పడ్డామని కాని అడియాసలుగానే మిగిలిపోయాయని గ్రామస్థులు వాపోతున్నారు.

బెస్తా వీధిలో ముత్యాలమ్మ జాతర

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 10: స్థానిక బెస్తా వీధిలో ఈ నెల 11న రజక సంక్షేమ సేవాసంఘం ఆధ్వర్యంలో శ్రీ ముత్యాలమ్మ జాతర జరగనుంది. ఉదయం అభిషేకం, కుంకుమ పూజలు, సాయంత్రం అమ్మవారి ఊరేగింపు జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు బుడంపర్తి నాగేశ్వరరావు, అత్తిలి శ్రీనివాసరావు, దువ్వాపు సూర్యనారాయణ బాబు తెలిపారు.

రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో జీసీటీఏ అధ్యాపకుల రాష్ట్రస్థాయి సమావేశం



జీసీటీఏ వార్షిక డైరీ ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 10: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల జీసీటీఏ సంఘం రాష్ట్రస్థాయి కార్యనిర్వాహక సమావేశం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ అధ్యాపకులు కొత్తగా వస్తున్న టెక్నాలజీలను అందిపుచ్చుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, క్షేత్రస్థాయి పరిశోధనలకు పునరంకితం కావాలని కోరారు. జీసీటీఏ వార్షిక డైరీలను ఆవిష్కరించారు. రాష్ట్ర జీసీటీఏ కార్యదర్శి ఎం.శ్యాంబాబు మాట్లాడుతూ అధ్యాపకులకు సర్వీస్ రెగ్యులరైజేషన్ త్వరగా పూర్తి చేయాలని, సీఎస్ ప్రాసెస్ మొదలుపెట్టాలని ఉన్నత విద్యాశాఖను కోరుతున్నట్టు తీర్మానించినట్టు చెప్పారు. వివిధ యాప్‌లపై అధ్యాపకుల నిరసనను పైఅధికారులకు తెలియజేసి సానుకూల స్పందన రాబడతామన్నారు. జీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రాఘవరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి పి.లలితా శరణ్య, వివిధ జిల్లాల నుంచి వచ్చిన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

6100 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

రాజానగరం, ఫిబ్రవరి 10: అక్రమంగా తరలిస్తున్న రూ.31,73,872 విలువ గల పీడీఎస్ బియ్యాన్ని శనివారం స్వాధీనం చేసుకున్నట్టు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. రాజానగరం మండలంలోని శ్రీరామనగర్ శివారు నుంచి వ్యాన్‌లో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కాపుకాచి వాహనాన్ని పట్టుకున్నామన్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా 122 ప్లాస్టిక్ బస్తాల్లో సుమారు 6100 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించామని, వాటి విలువ సుమారు రూ.31,73,872 ఉంటుందన్నారు. ఖమ్మం జిల్లా కల్లూరు గ్రామం నుంచి గొల్లప్రోలు మండలం బి.ప్రత్తిపాడు గ్రామానికి ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్టు వాహన డ్రైవర్ కరణం సద్గురుమూర్తి ద్వారా తమ విచారణలో తేలినట్టు రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కె.ఎస్.ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో చౌక బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. తనిఖీల్లో పలువురు అధికారులు పాల్గొన్నారు.